


హిందూపురంలో ఇటీవల మూడో తరగతి చదువుతున్న చిన్నారి ఎక్కువగా సెల్‌ఫోన్ చూస్తుండేది. కొంతకాలం తరువాత తలనొప్పి ఎక్కువగా ఉందని చెప్పడంతో వైద్యుడి వద్దకు తీసుకెళ్లారు. పరీక్షించిన డాక్టర్.. చిన్నారికి సెల్‌ఫోన్ ఎక్కువ సమయం ఇస్తున్నారా అని ప్రశ్నించారు. అవునని వారు చెప్పడంతో సెల్‌ఫోన్ మాన్పిస్తే తప్ప.. తలనొప్పి తగ్గదని వైద్యుడు చెప్పారు. దీంతో కొన్ని రోజులు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని తల్లిదండ్రులు చెప్పారు. సెల్‌ఫోన్ ఇవ్వకపోవడంతో పాఠశాలకు వెళ్లనని మారాం చేసింది. దీంతో చేసేదిలేక తిరిగి సెల్‌ఫోన్ ఇవ్వాల్సి వచ్చింది.



కొంపముంచిన కరోనా సమయం

ఆందోళనలో తల్లిదండ్రులు

సెల్‌లో బాల్యం..!

మొబైల్ మత్తులో చిన్నారులు

టీనేజీలో 50శాతం వినియోగిస్తున్న వైనం

చిలమత్తూరు మండలానికి చెందిన 9వ తరగతి విద్యార్థి హిందూపురం పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నాడు. తల్లిదండ్రులు గారాబంగా పెంచడంతో సెల్‌ఫోన్ పాఠశాలకు తీసుకొస్తున్నాడు. ఉపాధ్యాయులు గమనించి సెల్‌ఫోన్ లాక్కున్నారు. విషయం తల్లిదండ్రులకు చెప్పడంతో విద్యార్థి మూడురోజుల తరువాత ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తరువాత ఆపసోపాలుపడి పిల్లవాడిని తల్లిదండ్రులు ఇంటికి తీసుకొచ్చారు.

హిందూపురం పట్టణంలో నాలుగేళ్ల చిన్నారికి సెల్‌ఫోన్ ఇచ్చి తల్లి ఇంటి పనులు చేసుకుంటోంది. తరువాత సెల్‌ఫోన్ ఇవ్వకుండా మాన్పించారు. ఆ చిన్నారి మూడు రోజులు భోజనం మానేసింది. వైద్యుల వద్దకు తీసుకెళ్లి తమ బిడ్డ భోజనం తినలేదని చెప్పారు. ఆకలి వేయడానికి మందులిచ్చి పంపించారు. అయినా సరిగా భోజనం తినకుండా మారాం చేస్తూ వచ్చింది. ఆ తరువాత మానసిక వైద్యుడి వద్దకు తీసుకెళ్లే సమస్యను గుర్తించి, విషయం చెప్పాడు. దీంతో ఇంటికి వచ్చి సెల్‌ఫోన్ చేతికిచ్చి భోజనం పెడితే తిన్నది.

పైముగ్గురే కాదు, ఇలా సెల్‌ఫోన్‌కు బందీ అయినవారు పదేళ్ల నుంచి 15 ఏళ్లలోపు 50శాతం మంది ఉన్నట్లు ఓ అధ్యయనంలో తేలింది.

హిందూపురం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మొబైల్ చెరలో చిక్కి బాల్యం బందీ అవుతోంది. పసివాళ్లు మొబైల్ ఫోన్లకు బానిసలవుతున్నారు. ఫోన్ ఇవ్వనిదే ఏడుపు ఆపరు, అన్నం తినరు, పాఠశాలకు వెళ్లరు. వారికి నిత్యం ఫోన్ ఉండాల్సిందే. లేకుంటే అనారోగ్యం బారిన పడుతున్నారు. ప్రస్తుత తరుణంలో సెల్‌ఫోన్ పిల్లల చేతికి ఇస్తే ప్రయోజనం కంటే ప్రమాదకరం ఎక్కువ. ఐదేళ్లలోపు వారు కదిలే కార్టూన్ బొమ్మల్ని చూపించకుంటే గోరుముద్దలు తినరు. ఆరేళ్ల పైబడిన వారైతే సెల్‌ఫోన్ ఇస్తేనే అన్నం తింటామని అమ్మానాన్నకు షరతులు విధిస్తారు. రీల్స్ చూడాలంటారు, ఇవ్వకుంటే మారాం చేస్తారు. కోపగించుకుంటే అలిగి మూలన కూర్చుంటారు. దీంతో తల్లిదండ్రులు చేసేది లేక పిల్లలను గారాబంగా పెంచిన తరుణంలో వారి చేతికి సెల్‌ఫోన్ ఇస్తూ వారికి తెలియకుండానే బాల్యాన్ని బందీ చేస్తున్నారు. సామాజిక మాధ్యమాల వల్ల భావితరాలు వికృతబాట పట్టకూడదని ఇటీవల ఆస్ట్రేలియా ప్రభుత్వం 16 ఏళ్లలోపు పిల్లల విషయంలో వాటిని నిషేధించింది. ఫ్లోరిడా వంటి ప్రాంతాల్లో తరగతుల నిర్వహణ సమయంలో ఈ నిబంధనలు అమలు చేస్తున్నారు. ఇందులో మరి కొన్ని దేశాలు కూడా ఉన్నాయి.



ముద్ద ముట్టని పసిప్రాయం

ప్రస్తుత తరుణంలో పిల్లలకు అన్నం తినిపించడం పెద్ద పరీక్ష. కొన్నేళ్ల క్రితం 'చందమామ రావే.. జాబిల్లి రావే..' అంటూ చిన్నారి నోటిలో ముద్దలు పెట్టి గుటుక్కున మింగించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. వారికి అన్నం తినిపించాలంటే సెల్‌ఫోన్ చూపించాలి. కదిలే యానిమేషన్ బొమ్మలు కావాలి, లేదంటే కెవ్వున కేకలు వేస్తారు. అన్నం ప్లేటును విసిరికొడతారు. దీంతో చేసేది లేక సెల్‌ఫోన్ చేతికిచ్చి ముద్ద నోట్లో పెడుతున్నారు.

కరోనా సమయంలో..

కరోనా మహమ్మారి నాలుగేళ్ల క్రితం ప్రపంచాన్ని కుదిపేసింది. అందులో చిన్నారులు, యువతను కూడా వ్యసనాలవైపు మళ్లించిందని చెప్పవచ్చు. ఆ సమయంలో సెల్‌ఫోన్‌లో పాఠాలు చెప్పారు. అప్పుడు మధ్యతరగతి వారు ఫోన్లు కొనక తప్పలేదు. అలా అలవాటైన పిల్లలు వాటికి బానిసలయ్యారు. కార్పొరేట్ పాఠశాలల్లో ట్యాబ్‌లు, ప్రభుత్వ పాఠశాలల్లో యూట్యూబ్‌లో పాఠ్యాంశాలు బోధిస్తున్నారు. ఇవి కూడా చిన్నారుల సెల్‌ఫోన్ వాడకాన్ని పెంచాయని చెప్పవచ్చు.



బడి నుంచి రాగానే..

ఒకట్రెండు తరగతులు చదివే చిన్నారులు సాయంత్రం ఇంటికి రాగానే చేతిలో సెల్‌ఫోన్ ఉండాల్సిందే. లేదంటే ఇంట్లో గొడవే. తట్టుకోలేక చేతికిస్తే దానిని అలుసుగా తీసుకుని సెల్‌కి రోజూ అతుక్కునేలా చేసింది. ఇప్పటి పిల్లల పరిస్థితి ఎంతవరకు వచ్చిందంటే ఏదైనా ఇన్‌స్టాగ్రాం, ఫేస్‌బుక్ రీల్స్ చూస్తుంటే పిల్లలను పిలిస్తే ఎక్కడలేని కోపం వస్తుంది. కొందరు చేతిలో సెల్‌ఫోన్ విసిరేస్తారు. కొందరు ఆన్‌లైన్ షాపింగ్ మొబైల్‌లో పిల్లలతో చేయించడం ఒక వింత. పాఠాలు నేర్పాల్సిన ఉపాధ్యాయులే హోమ్‌వర్క్‌లు ప్రణాళికలను వాట్సాప్‌లో పంపిస్తూ వాటిని ఇంకాస్త దగ్గరకు చేర్చుతున్నారు. ఇదే క్రమంలో వ్యసనాలకు బానిసవుతున్నారు. ముఖ్యంగా ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు నిత్యం కొన్ని పాఠాలు సెల్‌ఫోన్‌లో పంపిస్తూ విద్యార్థులను సెల్‌ఫోన్‌కు బందీ చేస్తున్నారన్న విమర్శలున్నాయి.



చిన్నారుల ప్రవర్తనలో మార్పు వస్తోంది..

చిన్నారులు సెల్‌ఫోన్ వినియోగించడం ద్వారా వారికి తెలియకుండానే మార్పు వస్తోంది. తల్లులు పనిచేసుకోవాలనే ఉద్దేశంతో చిన్నారులకు సెల్‌ఫోన్ ఇవ్వడంవల్ల వారి విలువైన జీవితం నాశనం అవుతుందని గుర్తించలేకపోతున్నారు. 15ఏళ్లలోపు వారు రోజుకు గంటలోపు మాత్రమే స్క్రీన్ చూడాల్సి ఉంటుంది. పెద్దవారు కూడా 2 గంటలకు మించి స్క్రీన్ చూస్తే కొన్నిరోజుల తరువాత తెలియకుండానే ఇబ్బందులు వస్తాయి. ముఖ్యంగా చిన్నారులు సెల్‌ఫోన్ ఎక్కువగా చూడటంవల్ల తలనొప్పి, కంటి చూపు తగ్గడం గమనించవచ్చు. దీంతోపాటు చదువులపై ధ్యాస తగ్గిపోయి ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటుపడతారు. కొన్ని సందర్భాల్లో అసభ్యకర వీడియోలు చూసి చిన్నవయసులోనే తప్పుదోవ పట్టే అవకాశం ఉంది. అలాకాకుండా ఆటలవైపు చిన్నపిల్లలను తల్లిదండ్రులు మళ్లించాలి.

-రాజగోపాల్, మానసిక వైద్య నిపుణుడు, హిందూపురం



పారిశ్రామిక

పండగే..

జిల్లాకు భారీ ఆటోమొబైల్ పరిశ్రమ



- ఏర్పాటుకానున్న బస్సుల బాడీ బిల్డింగ్ యూనిట్
- గుడిపల్లిలో 70.7 ఎకరాలు కేటాయింపు
- రూ.1046 కోట్ల పెట్టుబడి
- 2381 మందికి ఉపాధి..
- సర్వత్రా హర్షాతిరేకాలు



పుట్టపర్తి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో జిల్లాలో పారిశ్రామిక పండగ మొదలైంది. పరిశ్రమలు క్యూ కడుతున్నాయి. జిల్లాకు మరో ఆటోమొబైల్ సంస్థ రాబోతోంది. ప్రపంచస్థాయి బస్సుల బాడీ బిల్డింగ్ సంస్థ ఎంఎస్ ఆజాద్ ఇండియన్ మొబిలిటీ ప్రైవేట్ లిమిటెడ్ జిల్లాలో యూనిట్ ఏర్పాటు చేయబోతోంది. మూడు దశల్లో రూ.1,046 కోట్ల పెట్టుబడితో ప్లాంట్‌ను జిల్లాలో నెలకొల్పనుంది. 2,381 మందికి ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన గురువారం రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన మంత్రి మండలి భేటీలో సంస్థకు భూమి కేటాయింపులకు ఆమోదం తెలిపారు. సోమందేపల్లి మండలం గుడిపల్లి పారిశ్రామిక వాడలో 44వ నంబరు జాతీయ రహదారి పక్కన 70.7 ఎకరాల భూమి కేటాయించారు. ఎకరా రూ.38.37 లక్షల చొప్పున కట్టబెట్టారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో ఎంఎస్ ఆజాద్ ఇండియన్ మొబిలిటీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ యూనిట్లు ఉన్నాయి. లగ్జరీ, సిటీ, స్కూల్, ఎయిర్‌పోర్టు పికప్, ఓఈఎం, ప్రత్యేక రవాణా బస్సుల బాడీ బిల్డింగ్‌లో ఆ సంస్థకు ప్రత్యేక గుర్తింపు ఉంది. పొరుగు రాష్ట్రం కర్ణాటకలోని బెంగళూరులోని మైసూరు రోడ్డు శేషగిరిహళ్లిలో సంస్థకు యూనిట్ ఉంది. అదే తరహాలో భారీ యూనిట్‌ను జిల్లాలో ఏర్పాటు చేసేందుకు సంస్థ ముందుకొచ్చింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఐదు నెలల్లోనే మడకశిరలో మొదటి దశలో రూ.1430 కోట్ల పెట్టుబడితో భారత్ ఫోర్జ్ అనుబంధ సంస్థ కల్యాణి స్ట్రాటెజిక్ సిస్టమ్స్ లిమిటెడ్ (కేఎస్ఎస్ఎల్) రక్షణ రంగానికి అవసరమైన ఫిరంగుల మందుగుండు సామగ్రి తయారీ పరిశ్రమకు ప్రభుత్వం భూములు కేటాయించింది. తాజాగా బస్సుల బాడీ బిల్డింగ్ పరిశ్రమకు భూముల కేటాయింపుతో జిల్లా ఆటోమొబైల్ రంగానికి మరింత ఊతమిచ్చినట్లయింది.

ఆటోమొబైల్ హబ్‌కు ఊతం

గత టీడీపీ హయాంలో పెనుకొండ వద్ద అంతర్జాతీయ కార్ల దిగ్గజం కియ పరిశ్రమతోపాటు అనుబంధ సంస్థల ఏర్పాటుతో ఈ ప్రాంతం పారిశ్రామిక హబ్‌గా మారిపోయింది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలైన ప్రపంచంలోనే అత్యున్నత శ్రేణి నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్ ఎక్సైజ్ నార్కొటిక్స్ (నాసిన్) ఏర్పాటు చేశారు. భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బెల్) నిర్మాణం చేపట్టారు. దీంతో పలు మాన్యుఫాక్చరింగ్ రంగ సంస్థలు జిల్లావైపు చూస్తున్నాయి. తాజాగా రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశంలో మెగా ప్రాజెక్టులకు ప్రత్యేక ప్రోత్సాహకాల ప్యాకేజీని అందజేయడానికి రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఆ మేరకు జిల్లాలో పారిశ్రామిక పెట్టుబడులను ప్రోత్సహించడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. బస్సుల బాడీ బిల్డింగ్ యూనిట్ కానుండడంపై జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దర్జాగా జలచౌర్యం..

కాలువ నీటిని మళ్లించుకున్న ఆవుల ఫాం యజమాని
అడ్డుచెప్పిన అధికారులపై చిందులు
7

చంద్రన్న కుటుంబం..!

సభ్యత్వ నమోదులో టీడీపీ దూకుడు



- ఉమ్మడి జిల్లాలో 9 లక్షలకు చేరువ
- లక్ష లక్ష్యాన్ని దాటి.. టాప్‌లో కళ్యాణదుర్గం
- రెండు, మూడు స్థానాల్లో కదిరి, పెనుకొండ
- 50 వేల మార్కు దాటని మూడు నియోజకవర్గాలు
- సంక్రాంతి వరకూ గడువు.. లక్ష్యం చేరేలా కార్యాచరణ

7

పింఛన్‌దారుల సర్టిఫికెట్లను క్షుణ్ణంగా పరిశీలించండి

వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఆదేశాలు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తి టౌన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక వ్యాధులతో మంచంపట్టి, రూ.15 వేలు ఎన్టీఆర్ భరోసా పింఛన్ పొందుతున్నవారి ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి క్రిష్ణబాబు ఆదేశించారు. ఈ మేరకు ఆయన గురువారం అమరావతి నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్ టీఎస్ చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ పాల్గొన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి మాట్లాడుతూ.. బోగస్ పింఛన్లను తొలగించే దిశగా క్షేత్రస్థాయిలో వైద్యబృందాలను నియమిస్తామన్నారు. సదరం ద్వారా జారీచేసిన ధ్రువపత్రాలను పరిశీలించాలన్నారు. ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్‌లో వివరాలు నిక్షిప్తం చేయాలన్నారు. దీనిపై పింఛన్‌దారులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 1,715 మంది దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు రూ.15వేల పింఛన్ పొందుతున్నారనీ, వీరిపై విచారణ చేయాలని సూచించారు. అందుకు ప్రణాళిక సిద్ధంచేయాలని ఆదేశించారు. జిల్లాస్థాయిలో కమిటీ ఏర్పాటు చేసి, విచారణ చేస్తామని కలెక్టర్ చేతన్ వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జడ్పీ డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, జిల్లా వైద్యాధికారి ఫిరోజ్ బేగం, డీసీహెచ్ఎస్ తిపేంద్రనాయక్, డీపీఓ సమత, గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారి సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నేటి నుంచి ఎస్ఎస్‌బీఎన్ వసంతోత్సవాలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్‌బీఎన్ విద్యాసంస్థల్లో మూడు రోజుల పాటు నిర్వహించే 80వ వసంతోత్సవాలను జయప్రదం చేయాలని పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు రమేష్‌బాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఆయన ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం పాఠశాలకు సంబంధించిన పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం, శనివారం జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయుల సమ్మేళనం, ఆదివారం డిగ్రీ, పీజీ పూర్వ విద్యార్థులు, అధ్యాపకుల ఆత్మీయ సమ్మేళనం, సన్మానాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో విద్యాసంస్థల్లో విద్యనభ్యసించిన ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రముఖులు హాజరవుతున్నారన్నారు.

హంసఫర్ ఎక్స్‌ప్రెస్ రద్దు

గుంతకల్లు, జనవరి2(ఆంధ్రజ్యోతి): ఉత్తర రైల్వేలోని జమ్ముతావిలో జరుగుతున్న యార్డు పనుల కారణంగా తిరుపతి-జమ్ముతావి-తిరుపతి (వయా గుంతకల్లు) హంసఫర్ ఎక్స్‌ప్రెస్ రైలును ఒక ట్రిప్పును రద్దు పరుస్తున్నట్లు రైల్వే అధికారులు గురువారం ప్రకటనలో తెలిపారు. తిరుపతి-జమ్ముతావి (నం. 22705) ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 7న, దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 22706)ను ఈనెల 10వ తేదీన రద్దు చేయనున్నట్టు పేర్కొన్నారు.

అభ్యంతరాలకు నేడే ఆఖరు

అనంతపురం విద్య, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ టీచర్ల సీనియారిటీ జాబితాపై శుక్రవారం సాయంత్రంలోగా అభ్యంతరాలు తెలియజేయాలని డీఈఓ ప్రసాద్‌బాబు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని కార్పొరేషన్, మున్సిపాలిటీలలో ప్రైమరీ స్కూల్ హెచ్ఎం, తెలుగు, హిందీ, ఉర్దూ స్కూల్ అసిస్టెంట్ పోస్టుల ప్రమోషన్లు ఇస్తున్నామన్నారు. ప్రమోషన్లకు అర్హులైన టీచర్ల తాత్కాలిక సీనియారిటీ జాబితా డీఈఓ బ్లాగ్ స్పాట్‌లో ఉంచామని తెలిపారు. జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే సాయంత్రం 5 గంటలలోగా తగిన ఆధారాలతో హెచ్ఎం, ఎంఈఓల ద్వారా తెలియజేయాలన్నారు.

దరఖాస్తు చేసుకోండి

అనంతపురం టౌన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): కడప జోన్ పరిధిలో 150 కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 3 నుంచి 17వతేదీ వరకు పని రోజుల్లో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. దరఖాస్తు నమూనా, ఇతర వివరాలను వెబ్‌సైట్‌లో ఉంచామని పేర్కొన్నారు. అర్హత ఉన్న అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్ఓ సూచించారు.

ఎమ్మార్పీ పోస్టు కోసం..

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): డీఆర్‌డీఏ-సీడాప్, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీలు సంయుక్తంగా పీఎం ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్‌ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ పథకం కింద పనిచేయడానికి మండల రిసోర్స్ పర్సన్ పోస్టుల నియామకాలకు ఈనెల 5వతేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య తెలిపారు. డిగ్రీ చదివి, కంప్యూటర్, ఇంటర్‌నెట్ పరిజ్ఞానం, స్మార్ట్‌ఫోన్ కలిగి ఉండి 21-30 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన పురుషులు, మహిళలు అర్హులన్నారు. ఈనెల 5వతేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 8న అనంతపురం పంగల్‌రోడ్డు సమీపంలోని టీటీడీసీలో రాతపరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ఎంపికైన అభ్యర్థులు జిల్లాలోని ఎంపికైన మండలంలో చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ఆసక్తి ఉన్న ఔత్సాహికవేత్తలకు అవగాహన కల్పించడం, పరిశ్రమల ఏర్పాటు, పురోగతి సాధించడానికి సహకరించాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థులకు ఒక పరిశ్రమ ఏర్పాటు చేయడానికి రూ.20వేలు పారితోషికం చెల్లిస్తారన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్లు 8985091256, 8639439808, 8639448535లను సంప్రదించాలన్నారు.

8న జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలు

అనంతపురం విద్య, జనవరి 2(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశాలు ఈ నెల 8వ తేదీ నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 8న ఉదయం 10.30 గంటలకు జడ్పీ సమావేశ మందిరంలో ఆర్థిక, ప్రణాళిక, వర్క్స్, గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్యం స్టాండింగ్ కమిటీ సమావేశాలు జరుగుతాయన్నారు. జడ్పీ అదనపు సమావేశ మందిరంలో మహిళా, శిశు సంక్షేమం, వ్యవసాయం, సాంఘిక సంక్షేమం స్టాండింగ్ కమిటీ సమావేశాలు జరుగుతాయన్నారు.

రేపటి నుంచి కళాశాలల్లో మధ్యాహ్న భోజనం

అనంతపురం విద్య/కొత్తచెరువు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ఈ నెల 4వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల విద్యాశాఖాధికారులు ప్రసాద్‌బాబు, కిష్టప్ప గురువారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు సమీపంలోని పాఠశాల ఏజెన్సీల ద్వారా అందిస్తారన్నారు. స్కూళ్లలో వండిన భోజనాన్ని జూనియర్ కళాశాలలకు చేర్చే బాధ్యత కాలేజీ ప్రిన్సిపాళ్లదేనని పేర్కొన్నారు.

సహకారం బలోపేతం

- సొసైటీలను పటిష్టం చేయడానికి చర్యలు
- సేవలను ప్రజలకు చేరువ చేసే యత్నం
- ఆధునిక పరికరాలతో వ్యవసాయానికి అండ
- ఆన్‌లైన్ సేవలతో అక్రమాలకు చెక్
- చురుగ్గా కంప్యూటరైజేషన్ ప్రక్రియ


రాచానపల్లి సొసైటీ

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): సొసైటీలు ఇక పటిష్టంగా మారనున్నాయి. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పీఏసీఎస్)లను అతి త్వరలో మల్టీ పర్పస్ క్రెడిట్ సొసైటీలుగా రూపాంతరం చేసేందుకు ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయి. అందులో భాగంగానే మొదటి దశలో సొసైటీలను కంప్యూటరైజేషన్ చేసే ప్రక్రియ చేపట్టారు. ఇప్పటికే సొసైటీల ఆన్‌లైన్ ప్రక్రియ దాదాపుగా తుది దశకు చేరింది. జాతీయ స్థాయిలో నేషనల్ డెవలప్‌మెంట్ కమిటీ, రాష్ట్ర స్థాయిలో స్టేట్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కమిటీలతో పాటు జిల్లా స్థాయిలో డీసీడీసీ(డిస్ట్రిక్ట్ కో-ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. జిల్లా స్థాయిలో కలెక్టర్ చైర్మన్‌గా, జిల్లా సహకార శాఖ అధికారి (డీసీఓ) కన్వీనర్‌గా ఉండే కమిటీలో జేసీ, జడ్పీ సీఈఓ, పశుసంవర్థక శాఖ జేడీ, మత్స్యశాఖ డీడీ, డీపీఓ, నాబార్డు డీడీఎంలతో పాటు ఆయా సమన్వయ శాఖల అధికారులు సభ్యులుగా ఉంటారు. సొసైటీలలో ఆన్‌లైన్ సేవలను ప్రారంభించి అవినీతి, అక్రమాలను అరికట్టి, రైతులకు మెరుగైన, నాణ్యమైన పారదర్శక సేవలు అందించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రైతులకు ఉపయోగకరమైన ఆధునిక వ్యవసాయ పరికరాలు, డ్రోన్‌లను వ్యవసాయంలో ప్రవేశపెట్టేందుకు చర్యలు చేపడుతోంది.

మల్టీపర్పస్ క్రెడిట్ సొసైటీలుగా మార్పు

ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలను మల్టీ పర్పస్ క్రెడిట్ సొసైటీలుగా మార్పు చేసి ప్రజలకు మరిన్ని సేవలు చేరువచేయడానికి ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. ఇదివరకు పనిచేసిన మీ-సేవ కేంద్రాల తరహాలో అన్ని రకాల సేవలను అందించేందుకు యోగిస్తున్నారు. అన్ని రకాల సేవలు అంటే మొబైల్ రీచార్జితో మొదలు విద్యుత్తు బిల్లులు, రవాణాకు టికెట్లు బుకింగ్ ఇలా అన్నీ సీఎస్‌సీ(కస్టమర్ సర్వీస్ సెంటర్) ద్వారా అందించనున్నారు. రైతులకు తక్కువ ధరకే నాణ్యమైన విత్తనాలు అందించేందుకు సీడ్ సొసైటీ, సేంద్రియ వ్యవసాయం ప్రోత్సహించేందుకు ఆర్గానిక్ సొసైటీ, రైతులు పండించిన పంటలను ఎగుమతి చేసేందుకు ట్రాన్స్‌పోర్ట్ సొసైటీలతో సహకార సొసైటీలను అనుసంధానం చేయనున్నారు. వీటితో జిల్లాలో రాచానపల్లి, పి కొత్తపల్లి పరిధిలో వంకరాజు కాలవ, ఎద్దులపల్లి, పాళ్యంతండా, బొమ్మనహాళ్, బేలేడు, బుక్కరాయసముద్రంలో గోడౌన్లను ఏర్పాటు చేసి రైతులు పండించిన పంటలను నిల్వచేయనున్నారు. యల్లనూరు, కణేకల్లు ప్రాంతాలతో పాటు నార్పల, ఆమిద్యాల, కూడేరులలో సొసైటీల ఆధ్వర్యంలో పెట్రోలు బంకులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే యల్లనూరులో ప్రారంభించగా, కణేకల్లులో పనులు జరుగుతున్నాయి. ప్రజలకు తక్కువ ధరకే మందులు అమ్మేందుకు జన ఔషధి పేరుతో జనరిక్ మందుల షాపులను సొసైటీల ఆధ్వర్యంలో ప్రారంభించారు. తొలి విడతలో అనంతపురం డీసీఎంఎస్, రాచానపల్లి, ముచ్చుకోట, గుంతకల్లు, రాయదుర్గం ఉద్దేహాల్, కళ్యాణదుర్గం చాపిరిలో ప్రారంభించారు.

అద్దెకు ఆధునిక వ్యవసాయ పరికరాలు

మల్టీ పర్పస్ క్రెడిట్ సొసైటీలలో ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరికరాలు ఏర్పాటు చేయడంపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. వ్యవసాయంలో ఆధునిక పరికరాలు, యంత్రాలతో పాటు డ్రోన్‌లు ఏర్పాటు చేయనున్నారు. రైతులకు ఖరీదైన ఆధునిక వ్యవసాయ పరికరాలు కొనుగోలు చేయడానికి ఆర్థిక స్తోమత లేని పరిస్థితుల్లో మల్టీ పర్పస్ క్రెడిట్ సొసైటీలలో నామమాత్రపు అద్దెతో వీటిని అందుబాటులోకి తేవాలని యోచిస్తున్నారు. ఈ ప్రతిపాదనలు ఇప్పటికే జిల్లా నుంచి ఇద్దరు ముగ్గురు ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి పంపినట్లు సమాచారం. ఈ ఆలోచన అమలుచేస్తే జిల్లాలో, రాష్ట్రంలో వ్యవసాయంలో డ్రోన్‌ల వినియోగం పెరిగే అవకాశం మెండుగా కనిపిస్తోంది.

కొలిక్కి వచ్చిన కంప్యూటరైజేషన్

సొసైటీల కంప్యూటరైజేషన్ ఇప్పటికే ఓ కొలిక్కివచ్చింది. మొదటి విడతలో ఖాతాలు, రుణాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, పెట్టుబడి ఇతరత్ర అంశాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. రెండో విడతలో ఆడిట్‌లో ఇతరత్ర అంశాలను నమోదు చేయనున్నారు. మూడో విడతలో 2024ఏప్రిల్ 1 నుంచి క్యాష్ డిపాజిట్ ఇతర లావాదేవీలు నమోదు చేయాలి. నాలుగో విడతలో ఆన్‌లైన్‌లో లైవ్‌లో ఉంచడం చేపట్టనున్నారు. దీంతో సొసైటీలలో అక్రమాలకు తావులేకుండా వ్యవహారాలన్నీ ఆన్‌లైన్‌లో నిర్వహించడం. ఈ ప్రక్రియ మొత్తం పూర్తి చేసి పీఏసీఎస్‌లను మల్టీ పర్పస్ క్రెడిట్ సొసైటీలుగా మార్పు చేయడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు సాగుతున్నాయి. దీంతో ఆర్థిక లావాదేవీలతో పాటు సబ్సిడీ ధరలకు రైతులకు ఎరువులు, మందులు, విత్తనాలు విక్రయించడం జరుగుతుంది. ఏప్రిల్ 1 నుంచి సొసైటీలు పూర్తి స్థాయిలో ఆన్‌లైన్‌లో లావాదేవీలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది.



డీసీఓ కార్యాలయం

సభ్యులకు ఈ-కేవైసీ తప్పనిసరి

ప్రాథమిక వ్యవసాయ పరపతి (పీఏసీఎస్)సొసైటీ సభ్యులు ఈ-కేవైసీ చేయించుకోవాలని ప్రభుత్వం సూచించింది. జిల్లాలోని 58సొసైటీలకు సంబంధించి స్పెషల్‌డ్రైవ్ ద్వారా గ్రామ సచివాలయాల్లో ఈ-కేవైసీ చేయడానికి ఏర్పాట్లు చేశారు. ఈ-కేవైసీ చేయించుకోని సభ్యులకు ప్రభుత్వం నుంచి వచ్చే ఎటువంటి లబ్ధి చేకూరదు. గ్రామ-వార్డు సచివాలయాలలో వేలిముద్రలు, ఇతరత్ర పత్రాలను అందజేసి ఓటీపీ ద్వారా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాల్సి ఉంటుంది. ఈనెల 1వతేదీ తరువాత సొసైటీలలో అన్ని సేవలు ఆన్‌లైన్‌లోనే ఉంటాయని, ఈ-కేవైసీ లేకుండా ఎటువంటి లావాదేవీలు చేయడానికి అవకాశం ఉండదని సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

సొసైటీలతో రైతులకు బహుళ ప్రయోజనాలు



ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలను మల్టీ పర్పస్ క్రెడిట్ సొసైటీలుగా మార్పు చేయడంతో రైతులకు బహుళ ప్రయోజనాలు చేకూరనున్నాయి. మల్టీ పర్పస్ క్రెడిట్ సొసైటీల సేవలను వినియోగించుకోవడానికి సభ్యులు ఈ-కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలి. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామ-వార్డు సచివాలయాలలో రైతులు (సభ్యులు) ఈ-కేవైసీ చేయడానికి ఏర్పాటు చేశాం. సొసైటీలలో పారదర్శక సేవలు అందించేందుకు కంప్యూటరీకరణ దోహదం చేస్తుంది.

- అరుణకుమారి, జిల్లా సహకార శాఖ అధికారి (డీసీఓ)

జబ్బొస్తే.. అంతే..!

- పశువుల ఆస్పత్రుల్లో మందుల కొరత
- 2024-25 బడ్జెట్ కేటాయించని వైనం
- ముగిసిన మందుల సరఫరా కాంట్రాక్ట్
- ఇబ్బందిపడుతున్న పాడి రైతులు


పశువైద్యశాల

తాడిపత్రి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా పశువుల ఆసుపత్రుల్లో మందుల కొరత ఏర్పడింది. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పాడి పరిశ్రమను ప్రోత్సహిస్తున్నామని జబ్బలు చరిచే ప్రభుత్వాలు కనీసం మందులు కూడా అందించలేని దుస్థితిలో ఉన్నాయని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో పశువుల ఆస్పత్రులు 15, డిస్పెన్సరీలు 56, గ్రామీణ పశువైద్యశాలలు 14, రైతు సేవా కేంద్రాలు 367 ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా ఆవులు 2,15,896, గేదెలు 1,89,843, గొర్రెలు 22,97,300, మేకలు 4,12,094, కోళ్లు 10,36,664 ఉన్నాయి. వీటన్నింటికి ఏడాదికి మందుల కోసం రూ.2.50కోట్ల బడ్జెట్ వచ్చేది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోవడంతో వైద్యులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో వైద్యుల కొరత కూడా ఉండటంతో పలు ఆసుపత్రుల్లో అటెండర్లే వైద్యం చేస్తున్నారు. 2024-25కు సంబంధించి పశువుల మందుల కోసం గత ప్రభుత్వం బడ్జెట్ కూడా కేటాయించలేదు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత రెండు త్రైమాసికాలకు బడ్జెట్ కేటాయించినా మందులు మాత్రం సరఫరా చేయలేదు. దీంతో ఏ చిన్న సమస్యపై ఆస్పత్రులకు పశువులను తీసుకువెళ్లినా ఇక్కడ మందులు లేవని, డాక్టర్లు బయటకు పంపిస్తున్నారని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆస్పత్రులకు మందులు సరఫరా చేసే రేట్ కాంట్రాక్టర్ సమయం డిసెంబరు ఆఖరికే పూర్తయినట్లు కొందరు వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుతం మరో కాంట్రాక్టర్‌ను పిలిచి, టెండర్ వేసి, మందులు సరఫరా చేయాలంటే దాదాపు 3నుంచి 4నెలలు సమయం పడుతుంది. అందుకే ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలు ఆలోచించి మందుల కొరత తీర్చాలని రైతులు కోరుతున్నారు.

డాక్టర్లు వైద్యం బాగా చేస్తున్నారు



డాక్టర్లు వైద్యం బాగా చేస్తున్నారు. కానీ ఆస్పత్రిలో కొన్ని రకాల మందులు లేకపోవడంతో పాడిరైతులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉంది. తాడిపత్రి పరిసర ప్రాంతాల్లో పాడిపై ఆధారపడిన రైతుల సంఖ్య ఎక్కువగా ఉంది. అయితే పశువులకు వచ్చే జబ్బులకు ఆస్పత్రిలో మందులు లేకపోవడంతో రైతులపై అదనపు భారం పడుతుంది.

- లక్ష్మణ్, తాడిపత్రి

మందులు బయటకు రాసిస్తున్నారు..

ఆస్పత్రికి పశువులను తీసుకొస్తే కొన్ని మందులు ఇక్కడ ఉన్నాయి. కొన్ని మందులు లేవని బయటకు పంపిస్తున్నారు. ఆసుపత్రిలోనే పశువులకు మందులు లేకపోవడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చేవారు ఇబ్బంది పడుతున్నారు. ప్రశ్నిస్తే మందులు ఉంటే మేమెందుకు ఇవ్వమని, ఉన్నవాటినే సర్దుతున్నామని అధికారులు చెబుతున్నారు. దీంతో చేసేదేమిలేక బయట నుంచి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

- నారాయణరెడ్డి, తాడిపత్రి

సాధ్యమైనంత వరకు మందులు ఇస్తున్నాం..



గొర్రెలు, మేకలు, కుక్కల టీకాలకు మందులు తక్కువ లేకుండా వివిధచోట్ల తెప్పించుకుంటున్నాం. కానీ కొన్ని మందులు లేవన్నది వాస్తవమే. ప్రస్తుతం మందుల కొరత ఉండటంతో ఇండెంట్ పెట్టాం. కానీ మందులు వచ్చేంత వరకు సర్దుకుంటూ వైద్యం చేస్తున్నాం.

- ఖాదర్‌బాషా, వైద్యుడు

శిథిలావస్థలో మార్కెట్ భవనం


పైకప్పు పెచ్చులూడి బయట పడిన ఇనుప కడ్డీలు

- ఊడుతున్న పైకప్పు పెచ్చులు
- బిక్కుబిక్కుమంటూ ఉద్యోగుల విధులు
- మూలుగుతున్న రూ.60 లక్షల నిధులు


ఊడుతున్న పెచ్చులు

అనంతపురం రూరల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీ భవనం శిథిలావస్థకు చేరుతోంది. భవన నిర్మాణం జరిగి అర్థ శతాబ్దం కావస్తోంది. భవనానికి చాలా చోట్ల పెచ్చులూడిపోయాయి. గోడల్లోని ఇనుప కడ్డీలు బయటకు కనిపిస్తున్నాయి. మరికొన్ని చోట్ల గోడలు బీటలు వారాయి. దీంతో కార్యాలయంలో ఎప్పుడు ఏమి జరుగుతుందోనన్న భయంతో ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో నూతన భవన నిర్మాణానికి రూ.60 లక్షలు నిధులు మంజూరయ్యాయి. భవన నిర్మాణం కార్యరూపం దాల్చలేదు. ఇంతలోనే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టింది. ప్రస్తుత ప్రజాప్రతినిధులు చొరవచూపితే నూతన భవన నిర్మాణానికి మోక్షం కలుగుతుంది.

ఇష్టారాజ్యంగా నిర్మాణాలు

గతంలో కార్యాలయ నిర్మాణాలు ఇష్టారాజ్యంగా జరిగాయి. 1977లో భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 2008లో భవనానికి మరమ్మతులు చేశారు. ఈ క్రమంలో వివిధ పాలకవర్గ సభ్యుల కాలంలో ఎవరికి వారు పనులు చేయించుకుంటూ వెళ్లారు. 2009లో అతిథి గృహం నిర్మించారు. 2012లో సమావేశ మందిరం ప్రారంభించారు. ఈవిధంగా అప్పటి పాలకవర్గ సభ్యులు నిర్మాణాలు చేయించారు. పాత భవనాన్నే ఆధునీకరించారు. ఈ క్రమంలో రూ.లక్షలు ఖర్చు చేశారు. ఏళ్లు గడిచిపోవడంతో చాలా చోట్ల భవనం దెబ్బతినింది. అతిథి గృహ గదులు పాత బంగ్లాలను తపిస్తున్నాయి. దీనికితోడు పలుచోట్ల లీకేజీలు ఏర్పడ్డాయి.

పాలకులు చొరవచూపితేనే..

గత ప్రభుత్వ హయాంలో నూతన భవన నిర్మాణానికి చర్యలు చేపట్టారు. యార్డులో వివిధ నిర్మాణాల నిమిత్తం 2022లో దాదాపు రూ.12 కోట్లు కేటాయించారు. ఇందులో నూతన కార్యాలయ నిర్మాణానికి రూ.60లక్షలు కేటాయించారు. నిధులు కూడా మంజూరయ్యాయి. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా నూతన భవన నిర్మాణానికి మోక్షం లభించలేదు. దీంతో కమిటీ ఖజానాలో నిధులు మూలుగుతున్నాయి. ప్రస్తుత పాలకులు, అధికారులు చొరచూపితే నూతన భవన నిర్మాణం జరిగే అవకాశం ఉంది.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



నూతన కార్యాలయ భవన నిర్మాణంతో పాటు యార్డులోని వివిధ నిర్మాణాల గురించి పాలకులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఈనెల 8న మార్కెటింగ్ శాఖ మంత్రి గుంటూరులో ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఈ నిర్మాణాలపై చర్చించే అవకాశం ఉంది. మేము కూడా ప్రజాప్రతినిధులు, ఉన్నాతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

- గోవిందు, ఎంపికశ్రేణి కార్యదర్శి, మార్కెట్ కమిటీ

కలెక్టర్ దృష్టికి సమస్యలు

ఆకాశవాణి 'అనంతమిత్ర'లో ఫిర్యాదుల వెల్లువ


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్

అనంతపురం టౌన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఆకాశవాణి కేంద్రంలో కలెక్టర్ వినోద్‌కుమార్ నిర్వహించిన 'అనంత మిత్ర'కు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. గురువారం ఆకాశవాణి కేంద్రంలో కలెక్టర్ ఫోన్‌ఇన్ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం7-45 గంటల నుంచి 8-15 వరకు సమస్యలు విన్నారు. ఈ సందర్భంగా అనంతపురం రామచంద్రనగర్‌కు చెందిన చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ఛత్రపతి శివాజీ నగరపాలక పాఠశాలలో తన కూతురు చదువుతోందని, టీచర్లు డ్యూటీకి రావడంలేదన్నారు. కమిషనర్, డీఈఓ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. ఇందుకు కలెక్టర్ స్పందించి పూర్తి స్థాయిలో విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని కమిషనర్‌ను ఆదేశించారు. లలితనగర్‌కు చెందిన శారదా మాట్లాడుతూ.. బళ్లారి బైపాస్ నుంచి టవర్‌క్లాక్‌వరకు ఏర్పాటు చేసిన బ్రిడ్జి అపరిశుభ్రంగా ఉందన్నారు. లలితనగర్‌లో 200 ఇళ్లు ఉన్నాయని, రోడ్డు, తాగునీరులేక ఇబ్బందులు పడుతున్నామని చర్యలు తీసుకోవాలని కోరారు. నగరానికి చెందిన నరసింహారెడ్డి మాట్లాడుతూ.. నగరంలోని ముఖ్య ప్రాంతాల్లో సులభ్ కాంప్లెక్సులు సరిగా నిర్వహించడంలేదన్నారు. దీంతో వివిధ ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రానికి వస్తున్న ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, అవసరమైన చోట ఏర్పాటు చేయాలని కోరారు. యాడికికి చెందిన గురుమూర్తి మాట్లాడుతూ.. రోడ్లు, డ్రైనేజీ సమస్యలు అధికంగా ఉన్నాయని పరిష్కరించాలని కోరారు. రాప్తాడు మండలం బొమ్మేపర్తికి చెందిన ఇస్సాంరెడ్డి మాట్లాడుతూ.. ముగ్గురికి కలిపి ఒక ట్రాన్స్‌ఫార్మర్ త్రీఫేజ్ కరెంట్ ఇవ్వాలని అనుమతులు ఇచ్చినా ఇంతవరకు పనులు మొదలు పెట్టలేదని ఫిర్యాదు చేశారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఓపికగా విన్న కలెక్టర్ వినోద్ కుమార్ వాటిని ఆయా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ విశ్వనాథ్, నగరపాలక సంస్థ ఇన్‌చార్జ్ కమిషనర్ రామలింగేశ్వర, ఆకాశవాణి డైరెక్టర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అటవీ స్థలాలను కాపాడుకోవాలి

- వన్యప్రాణుల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ
- డీఎఫ్ఓ విఘ్నేష్

అనంతపురం న్యూటౌన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అటవీ స్థలాలను కాపాడుకోవాలని డీఎఫ్ఓ విఘ్నేష్ సిబ్బందికి సూచించారు. గురువారం అనంతపురం రేంజ్ పరిధిలోని సిబ్బందికి అటవీ స్థలాల పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆత్మకూరు మండలం పంపనురులోని నగరవనం సమావేశ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో డీఎఫ్ఓ మాట్లాడుతూ.. వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టాలన్నారు. అడవిలో వన్యప్రాణుల నుంచి స్థానిక ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా తగిన జాగ్రత్తలు చేపట్టేలా అవగాహన కల్పించాలని తెలిపారు. అటవీశాఖ స్థలాలు, నాటిన మొక్కలు, అడవిలోని వన్యప్రాణులను ఏ విధంగా కాపాడవచ్చో వివరించారు. అనంతరం మరుట్ల సౌత్ బీట్‌కు వెళ్లి అక్కడ నాటిన మొక్కలను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. సిబ్బంది వారికి ఉన్న సమస్యలను డీఎఫ్ఓ దృష్టికి తీసుకెళ్లారు. మరుట్ల సౌత్‌బీట్‌లో 20 హెక్టార్లలో నాటిన మొక్కలను ఆయన పరిశీలించారు. ఈ శిక్షణలో రేంజర్ శ్రీనివాసులు, సెక్షన్ ఆఫీసర్ అక్బర్, బీట్ ఆఫీసర్స్ నీలవేణి, తేజేశ్వర్‌రెడ్డి, జగదీష్, శ్రీకాంత్, రవిచంద్రారెడ్డి, ఏబీఓలు గిరీష్, రామ్మోహన్ సిబ్బంది పాల్గొన్నారు.

7 నుంచి కరువు బృందం పర్యటన..?

అనంతపురం అర్బన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్‌లో పంటనష్టంపై అధ్యయం కోసం సెంట్రల్ మినిస్ట్రీయల్ బృందం (కరువు బృందం) ఈనెల 7వతేదీ నుంచి ఉమ్మడి జిల్లా పర్యటనకు రానున్నట్లు సమాచారం. ఇదివరకు ఈనెల 2, 3 తేదీల్లో కరువు బృందం ఉమ్మడి జిల్లాలోని కరువు మండలాల్లో పర్యటించనున్నట్లు షెడ్యూల్ ఖరారైంది. అనివార్య కారణాలతో పర్యటన వాయిదా పడింది. ఈ నేపథ్యంలో ఈనెల 7 నుంచి 9వతేదీ వరకు రాష్ట్రంలో కరువు బృందం పర్యటించనున్నట్లు ఈ మేరకు గురువారం షెడ్యూల్ ఖరారైనట్లు తెలిసింది. తొలుత ఉమ్మడి జిల్లాలోనే కరువు బృందం సభ్యులు పర్యటించే అవకాశం ఉన్నట్లు ఆ వర్గాల ద్వారా తెలుస్తోంది.

నేడు జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్

అనంతపురం విద్య, జనవరి 2(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్ రాప్తాడు మోడల్ స్కూల్‌లో శుక్రవారం నిర్వహించనున్నారు. మండలస్థాయి నుంచి విద్యార్థులు, ఉపాధ్యాయుల నుంచి గణితం, సైన్స్ ప్రాజెక్టులు సుమారు 70 వరకూ జిల్లా సైన్స్ ఫెయిర్‌కు వచ్చే అవకాశం ఉందని విద్యాశాఖాధికారులు స్పష్టం చేశారు. జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌లో అత్యుత్తమ ప్రాజెక్టుల ఎంపిక మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తున్నారు. జిల్లా సైన్స్ ఫెయిర్ నుంచి రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌కు 6 ప్రాజెక్టులను ఎంపిక చేయనున్నారు.

లా, బీఈడీ అడ్మిషన్లకు రిజిస్ట్రేషన్ గడువు పెంపు

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): లా, బీఈడీ కోర్సుల్లో అడ్మిషన్లకు రిజిస్ట్రేషన్ల గడువును ఈనెల 5 వరకు పొడిగించినట్లు ఉన్నత విద్యామండలి ఓ ప్రకటనలో తెలిపింది. యూనివర్సిటీల్లో స్పాట్ అడ్మిషన్లు, ప్రైవేటు లా, బీఈడీ కాలేజీల్లో కేటగిరీ బీ అడ్మిషన్లకు ఈ గడువు వర్తిస్తుందని తెలిపింది. అభ్యర్థుల వినతి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ఇకపై ఎలాంటి పొడిగింపు ఉండదని స్పష్టం చేసింది.

కేజీబీవీ ట్రైనర్లకు శిక్షణ ప్రారంభం

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): 'టీచింగ్ అనేది వృత్తి కాదని, భవిష్యత్తు తరాలకు మార్గదర్శకత్వం చేసే బాధ్యత' అని సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బీ.శ్రీనివాసరావు అన్నారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లోని మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం విజయవాడలోని లయోలా లా కాలేజీలో ఆయన ప్రారంభించారు. కేజీబీవీ టీచర్లు బాలికల జీవితాలను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తారని, బాలికలకు భద్రత, నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తారన్నారు. ఈ శిక్షణా సదస్సు నుంచి మెరుగైన బోధనా విధానాలు నేర్చుకుని, కేజీబీవీల్లో నాణ్యమైన విద్యనందించాలని కోరారు. కార్యక్రమంలో కేజీబీవీ కార్యదర్శి డి.దేవానందరెడ్డి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన శనివారం మెనూ మార్పు

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకంలో శనివారం అందించే ఆహారం మెనూను సవరిస్తూ మధ్యాహ్న భోజనం పథకం డైరెక్టర్ బీ.శ్రీనివాసరావు గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుత మెనూ ప్రకారం శనివారం రోజున విద్యార్థులకు ఆకు కూర అన్నం(పాలకూర, కొత్తిమీర, కరివేపాకు, పుదీనా), పప్పుచారు, స్వీట్ పొంగల్, రాగి జావ ఇస్తున్నారు. ఇక నుంచి ఆకు కూర అన్నం స్థానంలో సాధారణ అన్నం పెట్టి, స్థానికంగా అందుబాటులో ఉండే కూరగాయలతో కూర, స్వీట్ పొంగల్, రాగి జావ అందించాలని ఆదేశించారు.

చంద్రన్న కుటుంబం..!

సభ్యత్వ నమోదులో టీడీపీ దూకుడు.. ఉమ్మడి జిల్లాలో 9 లక్షలకు చేరువ





- లక్ష లక్ష్యాన్ని దాటి.. టాప్‌లో కళ్యాణదుర్గం
- రెండు, మూడు స్థానాల్లో కదిరి, పెనుకొండ
- 50 వేల మార్కు దాటని మూడు నియోజకవర్గాలు
- సంక్రాంతి వరకూ గడువు..
- లక్ష్యం చేరేలా కార్యాచరణ

అనంతపురం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాలో పార్టీ సభ్యత్వాలు జోరుగా సాగుతున్నాయి. ప్రతి నియోజకవర్గంలో లక్ష్యానికి మించి సభ్యత్వం చేయించాలని ప్రజా ప్రతినిధులకు చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఎమ్మెల్యేలు ఎవరికివారు తమ నియోజకవర్గాన్ని సభ్యత్వ నమోదులో అగ్రస్థానంలో నిలపాలని ప్రయత్నిస్తున్నారు. ద్వితీయశ్రేణి నాయకులు, ముఖ్యులకు సభ్యత్వ నమోదు బాధ్యతలను అప్పగించారు. దాదాపు రెండు నెలల క్రితం సభ్యత్వ నమోదు ప్రక్రియ మొదలైంది. కొన్ని నియోజకవర్గాల్లో ప్రజాప్రతినిధులు సభ్యత్వ నమోదులో దూకుడు పెంచారు. మరికొన్ని చోట్ల లక్ష సభ్యత్వాల లక్ష్యం కోసం ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. మూడు నియోజకవర్గాల్లో మాత్రం ఇంకా 50 వేల మార్క్ దాటలేదు. మొత్తంమీద.. గతంతో పోలిస్తే సభ్యత్వ నమోదులో టీడీపీ దూకుడు పెంచిందనే చెప్పాలి.

తొమ్మిది లక్షలకు చేరువ

● ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో ఇప్పటి వరకూ సభ్యత్వ నమోదు గణాంకాలు 9 లక్షలకు చేరువలో ఉన్నాయి. అనంతపురం పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని కళ్యాణదుర్గం, అనంతపురం అర్బన్, రాయదుర్గం, గుంతకల్లు, ఉరవకొండ, శింగనమల, తాడిపత్రి అసెంబ్లీ నియోజకవర్గాల్లో 17,47,314 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 4,13,757 మంది టీడీపీ సభ్యత్వాన్ని స్వీకరించారు. ఈ లెక్కన ఓటర్లలో 23.67 శాతం మంది టీడీపీ సభ్యత్వాన్ని తీసుకున్నారు.

● హిందూపురం పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని కదిరి, పెనుకొండ, రాప్తాడు, మడకశిర, పుట్టపర్తి, ధర్మవరం, హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 16,35,029 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 4,82,486 మంది టీడీపీ సభ్యత్వం తీసుకున్నారు. మొత్తం ఓటర్లలో ఇది 29.50 శాతం. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకూ 8,96,243 మంది టీడీపీ సభ్యత్వాన్ని తీసుకున్నారు. హిందూపురం పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోనే అత్యధికంగా సభ్యత్వాలు నమోదయ్యాయి.

కళ్యాణదుర్గం టాప్

● టీడీపీ సభ్యత్వ నమోదులో కళ్యాణదుర్గం నియోజకవర్గం అగ్రస్థానంలో ఉంది. ఇప్పటికే నిర్దేశించుకున్న లక్ష సభ్యత్వాల లక్ష్యాన్ని పూర్తి చేసుకుంది. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు నేతృత్వంలో స్థానిక నాయకుల చొరవతో గురువారం నాటికి 1,00,792 సభ్యత్వాలు నమోదయ్యాయి. ఆ నియోజకవర్గంలో మొత్తం 2,28,421 మంది ఓటర్లు ఉండగా.. 44.12 శాతం మంది టీడీపీ సభ్యత్వాన్ని తీసుకున్నారు.

● రెండో స్థానంలో కదిరి నియోజకవర్గం ఉంది. ఇక్కడ 85,245 సభ్యత్వాలు నమోదయ్యాయి. మూడో స్థానంలో ఉన్న పెనుకొండ నియోజకవర్గంలో 77,197 సభ్యత్వాలు నమోదయ్యాయి. నాలుగో స్థానంలో రాప్తాడు 76,776 సభ్యత్వాలు, ఐదో స్థానంలో అనంతపురం అర్బన్‌లో 70,241 సభ్యత్వాలు, ఆరో స్థానంలో రాయదుర్గంలో 68,337 సభ్యత్వాలు, ఏడో స్థానంలో మడకశిర 66,400 సభ్యత్వాలు, ఎనిమిదో స్థానంలో పుట్టపర్తి 64,055 సభ్యత్వాలు, తొమ్మిదో స్థానంలో ధర్మవరం 61,363 సభ్యత్వాలు, పదో స్థానంలో గుంతకల్లు 59,242 సభ్యత్వాలు, 11వ స్థానంలో హిందూపురం 51,450 సభ్యత్వాలు నమోదయ్యాయి.

● అనంతపురం జిల్లాలోని మూడు నియోజకవర్గాలలో సభ్యత్వ నమోదు 50 వేల మార్కు దాటలేదు. ఇందులో ఉరవకొండ 48,064 సభ్యత్వాలు, శింగనమలలో 44,650 సభ్యత్వాలు, తాడిపత్రిలో 22,431 సభ్యత్వాలు మాత్రమే నమోదయ్యాయి. సంక్రాంతి వరకూ సభ్యత్వాల నమోదుకు గడువు ఉంది. ఆ లోగా లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు ప్రజాప్రతినిధులు ప్రయత్నం చేస్తున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి.

శాశ్వత సభ్యత్వాలు ఆశాజనకం

టీడీపీ ఆవిర్భావం నుంచి క్రియాశీలక సభ్యత్వాలనే నమోదు చేస్తున్నారు. ఈసారి కొత్తగా శాశ్వత సభ్యత్వాలకు శ్రీకారం చుట్టారు. రూ.లక్ష చెల్లించి శాశ్వత సభ్యత్వం తీసుకున్నవారికి పార్టీ అధినేత చంద్రబాబును కలిసే అవకాశం కల్పించారు. ఈ నేపథ్యంలో శాశ్వత సభ్యత్వం పట్ల కొందరు ఆసక్తి కనబరిచారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకూ 26 మంది శాశ్వత సభ్యత్వాలు తీసుకున్నారు. అనంత అర్బన్‌లో అత్యధికంగా ఏడుగురు, ఉరవకొండలో నలుగురు, మడకశిరలో నలుగురు, శింగనమలలో ముగ్గురు శాశ్వత సభ్యత్వాన్ని తీసుకున్నారు. రాయదుర్గం, గుంతకల్లు మినహా.. మిగిలిన నియోజకవర్గాల్లో ఒక్కొక్కరు శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు.

దర్జాగా జలచౌర్యం..

కాలువ నీటిని మళ్లించుకున్న ఆవుల ఫాం యజమాని

అడ్డుచెప్పిన అధికారులపై చిందులు




క్వారీలోకి మళ్లించిన నీరు, డీఈపై చిందులు తొక్కుతున్న ఆవుల ఫాం యజమాని (ఎడమ)

బత్తలపల్లి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్) కుడి కాలువ ద్వారా చెరువులకు వదిలిన నీటిని ఓ ఆవుల ఫాం యజమాని దర్జాగా మళ్లించాడు. మూతబడిన క్వారీలోకి వదులుకున్నాడు. దీనిని అడ్డుకునేందుకు వెళ్లిన అధికారులపై రుబాబు చేశాడు. వాగ్వాదానికి దిగాడు. కుడి కాలువ ద్వారా బత్తలపల్లి, నారసింపల్లి చెరువులకు అధికారులు బుధవారం నీటిని వదిలారు. ఆ నీటిని మండలంలోని అనంతసాగరం గ్రామ సమీపాన ఆవుల ఫాం యజమాని గోపాల్ మళ్లించాడు. కల్వర్టు వద్ద కాలువకు అడ్డంగా రాళ్లు వేసి, మూతబడిన తన క్వారీ గుంతలోకి మళ్లించుకున్నాడు. విషయం తెలుసుకున్న నీటిపారుదల శాఖ డీఈ మహేశ్వరరెడ్డి, ఏఈ భవిత గురువారం బత్తలపల్లికి చెందిన రైతులతో కలిసి అక్కడికెళ్లారు. కాలువ నీటిని అక్రమంగా మళ్లించడం నేరమనీ, వెంటనే ఆపాలని గోపాల్‌కు సూచించారు. దీంతో అతడు ఆగ్రహంతో ఊగిపోయాడు. నీటి మళ్లింపును ఆపేది లేదనీ, చేతనైనది చేసుకోండంటూ రుబాబు ప్రదర్శించాడు. 'నేనంటే ఏమనుకున్నారు? నన్నే బంద్ చెయమంటారా, చేసిది లేదు ఏం చేసు కుంటారో.. చేసుకోండి. ఆపేదేలేదు. ఇక్కడి నుంచి వెళ్లిపోండి..' అంటూ అసభ్య పదజాలంతో దూషించాడు. దీంతో ఆవుల ఫాం యజమాని వ్యవహారాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామంటూ డీఈ, ఏఈ వెళ్లిపోయారు.

30 శాతం ఐఆర్ ప్రకటించాలి: ఆపస్

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): క్యాబినెట్ సమావేశంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిల అంశాలను ప్రస్తావించకపోవడం బాధాకరమని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) అధ్యక్షుడు ఎస్.బాలాజీ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలైనా.. ఇంతవరకు రూ.25 వేల కోట్ల బకాయిలు, ఐఆర్, డీఏ, 12వ పీఆర్ అంశాలపై సానుకూల ప్రకటనలు లేవన్నారు. ప్రతి నెలా రెండుసార్లు క్యాబినెట్ సమావేశాలు జరుగుతున్నా.. ఉద్యోగుల అంశాలపై చర్చ జరగట్లేదన్నారు. సంక్రాంతి కానుకగా 30 శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

9న మెగా జాబ్‌మేళా

ధర్మవరం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక సీఎన్‌బీ కల్యాణమండపంలో ఈనెల 9న మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. 90 దాకా బహుళజాతి కంపెనీలు పాల్గొంటాయన్నారు. పది, ఇంటర్, ఐటీఐ, డిప్లమా, బీఫార్మసీ, ఎం ఫార్మసీ, నర్సింగ్, డిగ్రీ, పీజీ చదివిన 18 నుంచి 35 ఏళ్లలోపు వయసువారు అర్హులన్నారు. జాబ్‌మేళాలో ఎంపికైన వారికి నెలకు రూ.10వేల నుంచి రూ.50వేల వరకు వేతనం ఉంటుందన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే వారు విద్యార్హత పత్రాల నకలు, ఆధార్‌కార్డు, రెండు ఫొటోలు తీసుకురావాలన్నారు. ఈ అవకాశాన్ని యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు. వివరాలకు 9182288465, 9490442576, 9390176421 నంబర్లలో సంప్రదించాలన్నారు.

వ్యవసాయ ఉద్యోగుల సంఘం నూతన కమిటీ ఎన్నిక



ఏపీ వ్యవసాయ ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా నూతన కమిటీ

అనంతపురం అర్బన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ ఉద్యోగుల సంఘం (ఏపీఏఈఏ) ఉమ్మడి అనంత జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గురువారం స్థానిక కృషి భవన్‌లో ఏపీ వ్యవసాయ ఉద్యోగుల సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామిరెడ్డి, కార్యదర్శి వెంకటేశ్వరరావు, అసోసియేట్ ప్రెసిడెంట్ రఘురామనాయుడు, కోశాధికారి శ్రీహరి, ఉపాధ్యక్షుడు రూపేష్‌కుమార్ ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా శశిధర్‌రెడ్డి, కార్యదర్శిగా నరసింహ, సహఅధ్యక్షుడిగా ఆనందరాజు, కోశాధికారిగా ఆదిల్‌బాషా, ఉపాధ్యక్షులుగా ఆంజనేయులు, నారాయణస్వామి, శివకుమార్, రామలింగారెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా నాగభూషణం, అనిల్, రాజేష్, మోహన్‌కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా రాజ్యలక్ష్మి, ఖాద్రి, ఈసీ సభ్యులుగా లీలావతి, వెంకటేశ్వర్లు, రహంతుల్లా, రాష్ట్ర ఈసీ సభ్యులుగా శశికళ, హేమంత్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఆనందరాజు, సురేంద్ర, సత్యనారాయణ, నరసింహ, కడప జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ గౌడ్ పాల్గొన్నారు.

రాచకం నుంచి అభివృద్ధి వైపు..

విద్యార్థుల భవిష్యత్తు, ఉద్యోగుల సంక్షేమం దిశగా జేఎన్‌టీయూ

ఒకప్పుడు ఉమ్మడి రాష్ట్రంలోనే సాంకేతిక విద్యకు ఎంతో ప్రఖ్యాతిగాంచిన జేఎన్టీయూ గత వైసీపీ హయాంలో కునారిల్లింది. మితిమీరిన రాజకీయ జోక్యం, కొన్ని అదృశ్య శక్తులు వర్సిటీ ప్రతిష్టను మసకబార్చాయి. కూటమి ప్రభుత్వం రాకతో ఆరునెలల్లోనే పరిస్థితులు చాలా వరకు మారాయి. గత వైసీపీ పాలనలో ఉన్నతాధికారుల మధ్య వైరాన్ని సృష్టించి రెండుగా చీల్చారు. ఆకస్మిక బదిలీలు, ఆలస్యంగా ఉద్యోగోన్నతులు, ప్రశ్నించిన వారిపై కక్షసాధింపు చర్యలకు పాల్పడింది. ప్రతిభ, అర్హతకు పాతరేసి, తమకు నచ్చిన వారికే ఉద్యోగోన్నతులు, ఉన్నత పదవులు, కీలక స్థానాలు కట్టబెట్టడంలో అదృశ్య శక్తులు పనిచేశాయి. ఆ అరాచకాలకు చరమగీతం పాడుతూ జేఎన్టీయూ.. మరోసారి అభివృద్ధి వైపు పయనిస్తోంది. పారదర్శకమైన పాలన లక్ష్యంగా ఉన్నతాధికారులు నిర్ణయాలు తీసుకుంటున్నారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం సెంట్రల్



జేఎన్టీయూ పరిపాలనా భవనం



వర్సిటీ అకడమిక్, అడ్మినిస్ట్రేషన్ అంశాల్లో యాజమాన్యం తీసుకునే నిర్ణయాలు వేలాదిమంది విద్యార్థులు, వందలాదిమంది ఉద్యోగులపై ప్రభావం చూపుతాయి. జేఎన్టీయూ పరిధిలోని అనంతపురం, చిత్తూరు,

పారదర్శకమైన నిర్ణయాలు...

కడప, కర్నూలు, నెల్లూరు ఉమ్మడి జిల్లాల్లో ఇంజనీరింగ్ 72, ఫార్మసీ 45, ఎంసీఏ, ఎంబీఏ 67.. ఇలా మొత్తం 184 కళాశాలల భవిష్యత్ ఆధారపడి ఉంటుంది. ప్రవేశాలు, పాఠ్యాంశాల రూపకల్పన, తరగతుల నిర్వహణ, ప్రశ్నపత్రాల తయారీ, పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం, ఫలితాల విడుదల, సర్టిఫికెట్ల జారీ.. ఇలా అనేక అంశాల్లో వర్సిటీ యాజమాన్య నిర్ణయాలు ప్రధాన పాత్ర పోషిస్తాయి. గత వైసీపీ పాలనలో అనాలోచిత నిర్ణయాలతో విద్యార్థులు, ఉద్యోగులు, కళాశాలలు కునారిల్లాయి. వాటికి చరమగీతం పాడుతూ నూతన యాజమాన్యం పారదర్శమైన పాలన సాగిస్తోంది.

పారదర్శక పాలన లక్ష్యంగా నిర్ణయాలు

కూటమి రాకతో వర్సిటీలో మార్పులు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో జేఎన్‌టీయూ వీసీ, రిజిస్ట్రార్ (ఫైల్)

విద్యార్థుల భవిష్యత్తుకు నాంది..

ఇంజనీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏలోని పలుకోర్సులను జేఎన్టీయూ అందిస్తోంది. ప్రతియేటా వేలాదిమంది డిగ్రీ పట్టాలను పుచ్చుకుంటున్నారు. గత ఐదేళ్లలో ఉద్యోగ కల్పనను ఎండమావిగా మారింది. చదువు పూర్తయిన వెంటనే ఉద్యోగం పొంది జీవితంలో స్థిరపడాలన్న విద్యార్థులు, తల్లిదండ్రుల ఆకాంక్షలను కలగానే మిగిల్చారు. వారి కలలను సాకారం చేసేలా కొత్త యాజమాన్యం ప్రయత్నాలు సాగించింది. కియ సంస్థ ప్రతినిధులతో చర్చించి తమ విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించాలని ఒప్పందాన్ని కుదుర్చుకుంది. జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో సంప్రదించి వాటికి అవసరమైన రీతిలో విద్యార్థులకు శిక్షణ చేపట్టింది. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ పద్ధతుల్లో ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించి వందలాదిమంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించింది. విద్యార్థులను ఉద్యోగాలకు సన్నద్ధం చేసేలా క్లబ్‌లను ఏర్పాటు చేసి కోఆర్డినేటర్లుగా ఫ్యాకల్టీని నియమించింది.



ఆర్థిక ప్రయోజనాలు చెల్లించడంతో వీసీ సుదర్శనరావుని సన్మానిస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు (ఫైల్)

ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం..

ఉద్యోగుల సమస్యలు ఒక్కొక్కటి పరిష్కారమవుతున్నాయి. రిటైర్డ్ ఉద్యోగులకు దక్కాల్సిన ఆర్థిక ప్రయోజనాలను చెల్లించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లకు పెరిగిన జీతాలను జమచేశారు. ఉద్యోగులకు డీఏ బకాయిలు విడుదలచేశారు. అర్హత, అనుభవం ప్రాతిపదికగా బదిలీలు చేశారు. ప్రమోషన్లు ఇచ్చేందుకు మెరిట్ జాబితాను రూపొందించారు. ఇలా అనేక సమస్యలను నూతన యాజమాన్యం ఒక్కొక్కటిగా పరిష్కరిస్తోందని ఉద్యోగ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. గత ప్రభుత్వంలో ఉద్యోగులకు ఎప్పుడు బదిలీ వస్తుందో తెలియని పరిస్థితి. నిత్యం అభద్రత నడుమ విధులు నిర్వహించారు. ప్రశ్నిస్తే కక్షసాధింపు చర్యలకు బలికావాల్సి వచ్చేది. గొంతువిప్పిన వారిపై వేటువేసేవారు. ఒక మాజీ వీసీ, రాష్ట్రస్థాయిలో కీలకంగా వ్యవహరించిన మరో అధికారి వర్సిటీని వెంటాడి తమ జీవితాలతో ఆటాడుకున్నారని ఉద్యోగ వర్గాలు గుర్తుచేసుకుంటున్నాయి. అభివృద్ధి పనుల కాంట్రాక్టులు, హాస్టల్ నిర్వహణ, సరకుల సరఫరా.. ఇలా ఏదైనా వారి వర్గానికి దక్కించుకుని లబ్ధిపొందారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

పూర్వవైభవాన్ని తీసుకువస్తున్నాం..

విశ్వవ్యాప్తంగా కీర్తిని చాటిన వర్సిటీకి పూర్వవైభవం తీసుకువస్తున్నాం. విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దే విశ్వవిద్యాలయాలపై గత ప్రభుత్వం కక్షిసాధింపు ధోరణి అవలంభించింది. అడ్డగోలు నిర్ణయాలతో అకడమిక్, అడ్మినిస్ట్రేషన్ వ్యవస్థలను నీరుగార్చారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్‌కు సమస్యలను వివరించడంతో సానుకూలంగా స్పందిస్తున్నారు. ఈ మేరకు రిటైర్డ్ ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనాలు చెల్లించాం. టీచింగ్ అసిస్టెంట్స్‌కు పెరిగిన జీతాలిచ్చాం. వందలాదిమంది విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించాం. కియ కంపెనీతో పాటు జాతీయ, అంతర్జాతీయ సంస్థలను సంప్రదించి ఎంఓయూలు చేసుకుంటున్నాం.

-ప్రొఫెసర్ సుదర్శనరావు, ఇన్‌చార్జ్ వీసీ



ఫుట్‌బాల్ మహిళా జట్టులో అనూష



మ్యాచ్ ఆడుతున్న అనూష (ఫైల్)

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఫుట్‌బాల్ అండర్-20 భారత మహిళ జట్టులో జిల్లాకు చెందిన క్రీడాకారిణి అనూష చోటు సంపాదించింది. ఆత్మకూరుకు చెందిన అనూష 2015 నుంచి ఫుట్‌బాల్ ఆడుతోంది. ఇప్పటికే రాష్ట్ర, జాతీయ పోటీలకు ప్రాతినిధ్యం వహించింది. గతేడాది అండర్-19 భారత ఫుట్‌బాల్ జట్టు ప్రాబబుల్స్‌లో చోటు దక్కించుకుంది. ప్రస్తుతం ఆర్డీటీ ఫుట్‌బాల్ అకాడమీలో రెసిడెన్షియల్‌లో సాధన చేసుకుంటూ... ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. బెంగళూరులో శుక్రవారం మాల్దీవులతో జరిగే ప్రాక్టీస్ మ్యాచ్‌లో భారత అండర్-20 జట్టు తరఫున అనూష ఆడనుంది. అనూషను ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛోఫెర్రర్, ఏపీ రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కోటగిరి శ్రీధర్, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వేణుగోపాల్, మల్లేష్, ఆర్డీటీ ఫుట్‌బాల్ కోఆర్డినేటర్ దాదా ఖలందర్ అభినందనందించారు.

గంగమ్మ ఆలయంలో చోరీ...

అనంతపురం క్రైం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం కామారుపల్లి సమీపంలోని గంగ మ్మ ఆలయంలో చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం అర్ధరాత్రి ఆలయంలోకి ప్రవేశించి వెండివస్తువులు, హుండీని పగలకొట్టి కొంత నగదు ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై అనంతపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఆసుపత్రి నుంచి వ్యక్తి అదృశ్యం...



మల్లప్ప

అనంతపురం క్రైం, జనవరి 2(ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజనాసుపత్రి నుంచి ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. శ్రీ సత్యసాయి జిల్లా పరిగి మండలం బీచ్‌గానిపల్లికి చెందిన మల్లప్ప ఈ నెల 30వ తేదీన ప్రభుత్వాసుపత్రిలో డెలివరీ కోసం వచ్చిన కోడలిని చూడటానికి వచ్చాడు. కొంతసేపటికే అక్కడి నుంచి అదృశ్యమయ్యాడు. అతడు గురువారం కూడా ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు టూటౌన్‌లో ఫిర్యాదు చేశారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి

తాడిపత్రి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో గురువారం గుర్తుతెలియని వృద్ధుడు (70) మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి అనారోగ్యంతో మృతి చెందినట్లు చెప్పారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. ఎవరికైనా ఇతడి ఆచూకీ తెలిస్తే తమకు తెలపాలని వారు కోరారు.

సంక్రాంతికి ప్రత్యేక బస్సులు

రాయలసీమ డిపోల నుంచి 2,327 సర్వీసులు

ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ పూల నాగరాజు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పూల నాగరాజు

అనంతపురం కల్చరల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల కోసం రాయలసీమ జిల్లాల్లోని డిపోల నుంచి మొత్తం 2,327 ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ పూల నాగరాజు తెలిపారు. గురువారం ఆయన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. ఈనెల 8వ తేదీ నుంచి 12వ తేదీ వరకు 1147 బస్సులు, 14 నుంచి 19వ తేదీ వరకు 1180 బస్సు సర్వీసులు నడపుతామన్నారు. అనంతపురంతోపాటు సత్యసాయి, నంద్యాల, కర్నూలు, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, వైఎస్ఆర్ కడప జిల్లాల పరిధిలోని అన్ని ఆర్టీసీ డిపోల నుంచి సర్వీసులను నడుపుతామని పేర్కొన్నారు. ప్రత్యేక బస్సుల్లో ఎలాంటి అదనపు చార్జీలు వసూలు చేయలేదని తెలిపారు. ఆన్‌లైన్‌లో సైతం ముందస్తు రిజర్వేషన్లు పొందవచ్చునన్నారు. రాను, పోను ఒకేసారి బుక్ చేసుకున్నవారికి టికెట్ ధరలో 10శాతం రాయితీ కల్పిస్తున్నట్లు తెలిపారు. రద్దీ ప్రాంతాలైన బెంగుళూరుకు 406, హైదరాబాద్‌కు 442, విజయవాడకు 107, చెన్నైకు 24 సర్వీసులను ప్రత్యేకంగా నడుపుతున్నామని పేర్కొన్నారు.

గర్భం దాల్చిన బాలిక..?

అనంతపురం రూరల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): నగర శివారులోని ఓ ప్రభుత్వ కళాశాలలో మైనర్ విద్యార్థిని గర్భం దాల్చిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ వ్యవహారం బయట పొక్కకుండా సంబంధిత కళాశాల అధ్యాపకులు సద్దుమణిగించారు. ఆ అమ్మాయి నగర శివారుల్లోని ఓ ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. పదిరోజుల కిందట విద్యార్థిని కడుపు అనుమానాస్పందంగా కనిపించడంతో అధ్యాపకులు వైద్యులకు చూపించారు. సదరు విద్యార్థిని గర్భందాల్చినట్లు నిర్ధారించుకున్నారు. దీంతో అధ్యాపకులు విద్యార్థిని తల్లిదండ్రులను పిలిపించి మాట్లాడారు. ఈ క్రమంలోనే విద్యార్థినితో పూర్తి విషయాలను ఆరా తీశారు. తరువాత తల్లిదండ్రులు, విద్యార్థినితో కళాశాల అధ్యాపకులు లెటర్ రాయించుకున్నట్లు తెలుస్తోంది. విషయం జిల్లా ఉన్నతాధికారులు, సంబంధిత శాఖ అధికారుల దృష్టికి వెళ్లినట్లు సమాచారం. ఈ క్రమంలోనే గురువారం ఉన్నతాధికారులు విచారించినట్లు తెలిసింది. ఈ విషయంపై సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్, శాఖల ఉన్నతాధికారులను సంప్రదించగా.. అలాంటి ఘటన ఏమీ జరగలేదని అన్నారు.

టన్ను రూ.28 వేలు

అనంతపురం రూరల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 28,190 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 11 వేలు, సరాసరి రూ. 18 వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు.

న్యూస్ బాక్స్

టీడీపీ విస్తృతస్థాయి సమావేశాన్ని జయప్రదం చేయండి: ఎమ్మెల్యే కందికుంట



కదిరి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): టీడీపీ నియోజకవర్గ కార్యకర్తలు, నాయకుల విస్తృస్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పిలుపునిచ్చారు. ఆయన నివాసంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సమావేశంలో ఆరునెలల పాలనపై సమీక్ష, పార్టీ సభ్యత్వ నమోదు, కార్యకర్తల యోగక్షేమాలపై చర్చించడానికి సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 3గంటలకు సమావేశం ఉంటుందన్నారు. నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

ప్లేట్లు, వంటపాత్రల వితరణ

ధర్మవరం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలకు ప్లేట్లు, వంటపాత్రలను పల్లెం జనార్దన్ అందించారు. ఆయనను ప్రిన్సిపాల్ ప్రశాంతి, అధ్యాపకులు సన్మానించారు.

ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం



మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

ఓబుళదేవరచెరువు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): రైతులకు ప్రతియేడాది కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పీఎం కిసాన్ రూ.6 వేల పదివేలకు పెంచడంపై బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఆర్గానిక్ కన్వీనర్ చింతా శరత్‌కుమార్‌రెడ్డి, మండలాధ్యక్షుడు వీరాంజనేయులు, జిల్లా కార్యవర్గసభ్యులు అశ్వత్థప్ప, మేకల వెంకటరమణ, మాజీ అధ్యక్షుడు సున్నంపల్లి రంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, నాయకులు నీలకంఠారెడ్డి, కూటమి నాయకుడు సుధాకర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

గాండ్లపెంట, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి రామమోహన్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎమ్మార్సీలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 12వ పీఆర్సీని ఆలస్యం చేస్తోందని, 30 శాతం ఐఆర్ ప్రకటించాలని, అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్లకు జేఎల్‌గా పదోన్నతులు కల్పించాలన్నారు. ఎంఈఓలు క్రిష్ణానాయక్, శ్రీనివాసులు, ఎస్టీయూ నాయకులు షౌకత్, రమేష్, చక్రపాణి, మనోహర్, మహేష్, చైతన్య, సూర్యనారాయణ పాల్గొన్నారు.

నంబులపూలకుంట: ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓలు గోపాల్‌నాయక్, సుబ్బిరెడ్డి, మండలాధ్యక్షుడు రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి వీరమహేశ్వర్‌రెడ్డి, ధనుంజయ్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రమణ నాయక్, చిట్టెమ్మ, చరణ్, మురళి, భోగాదిరెడ్డి పాల్గొన్నారు.

బుక్కపట్నం: అర్హులైన స్కూల్ అసిస్టెంట్లకు హెచ్ఎంలుగా పదోన్నతి కల్పించాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొనంకి చంద్రశేఖర్ కోరారు. గురువారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓలు గోపాల్‌నాయక్, మోహన్‌బాబు, శంకర్‌నారాయణ, రామాంజనేయులు, భాస్కర్‌చౌదరి, ప్రమీలమ్మ, మంజుల, వనజ పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

నల్లమాడ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ రాబర్టు విల్సన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలన్నారు. గ్రామాల్లో నెలకున్న సమస్యలను సమావేశంలో చర్చించాలన్నారు.

బీజేపీ పట్టణాధ్యక్షుడిగా కల్యాణ్‌కుమార్



పుట్టపర్తి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షుడిగా కల్యాణ్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎంపికచేశారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ ఆధ్వర్యంలో పార్టీ సమావేశం నిర్వహించారు. అధ్యక్షుడు మాట్లాడుతూ పార్టీకి కల్యాణ్ చేసిన సేవలను గుర్తించి పదవిని ఇచ్చినట్లు తెలిపారు.

బైక్ రేసర్ల అరెస్టు

కదిరి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారుల్లోని హిందూపురం, అనంతపురం బైపాస్ రోడ్లలో అతివేగంగా బైక్ రేసు చేస్తున్న నలుగురు యువకులను అరెస్టు చేసినట్లు సీఐ నారాయణ రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన మేరకు కొత్తగా నిర్మించిన హిందూపురం, అనంతపురం బైపాస్‌రోడ్డులో గురువారం పదిమంది యువకులు బైక్ రేసు చేస్తున్నారు. అందిన సమాచారం మేరకు బైపాస్ రోడ్డు వద్దకు వెళ్లి వారిని అరెస్టు చేసి, మూడు బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మరికొంతమంది యువకులు పారిపోయారన్నారు. అరెస్టు చేసిన యువకుల తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి, డీఎస్పీ శివనారాయణస్వామి కౌన్సెలింగ్ ఇచ్చారన్నారు. తల్లిదండ్రుతోపాటు యువకులను తహసీల్దార్ సమక్షంలో బైండోవర్ చేశారు. మూడు బైక్‌లను కదిరి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్‌కు అప్పగించామన్నారు.

డీఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీ

హిందూపురం అర్బన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): పట్టణ, మండల పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను డిఎంహెచ్ఓ మంజువాణి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హిందూపురం లక్ష్మీపురం పిహెచ్‌సీని, మండల పరిధిలోని బేవనహళ్ళి ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేసి ల్యాబ్‌లు, ఫార్మసీ, డెలివరి వార్డు తదితర విభాగాలను పరిశీలించారు. కార్యక్రమంలో బేవనహళ్ళి వైద్యులు షిఫా, జయానంద్‌నాయక్, లక్ష్మీపురం ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

గతుకుల రోడ్లలోనే ప్రయాణం..!

- సంక్రాంతికి రహదారులు బాగుపడేనా?
- దశాబ్దాలుగా మరమ్మతులకు నోచుకోని మున్సిపల్ రోడ్లు
- శివార్లలో చినుకు పడితే చిత్తడే

కదిరి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): దశాబ్దాలు గడుస్తున్నా మున్సిపాలిటీలో రోడ్లు మరమ్మతులకు నోచుకోలేదు. ఏళ్ల తరబడి రోడ్లకు మరమ్మతులు చేపట్టకపోవడంతో ఎక్కడ చూసిన గుంతలే దర్శనమిస్తున్నాయి. ఈ గతుకుల రోడ్లలో నడవడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గుంతల రోడ్లు బాగు చేయిస్తామని హామీ ఇచ్చింది. సంక్రాంతిలోపు రోడ్లలో గుంతలు ఉన్నట్లు తనకు వాట్సప్‌లో



దశాబ్దాలుగా మరమ్మతులకు నోచుకోని యర్రగుంటపల్లి రోడ్డు

ఫొటోలు పెడితే ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకుంటానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హెచ్చరించారు. అయితే కదిరిలోని మున్సిపాలిటీలో అనేక రోడ్లలో గుంతలు దర్శనమిస్తున్నాయి. వర్షమొస్తే గుంత ఎక్కడో, రోడ్డు ఎక్కడో తెలియని పరిస్థితి. మున్సిపాలిటీలో రోడ్లకు పడిన గుంతలు పూడ్చడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు విడుదల చేస్తోంది. ఇక శివారు ప్రాంతాల్లో వర్షం వస్తే రోడ్లన్నీ చిత్తడే. ఇక్కడ నడవాలంటే ఇబ్బందులు పడాల్సిందే. నిధులున్నా కొన్ని రోడ్లు వేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ సంక్రాంతికి కూడా మున్సిపాలిటీలో ప్రజలు ఈ గతుకుల రోడ్లలోనే నడవాల్సిందే.

మరమ్మతులకు నోచుకోని మున్సిపల్ రోడ్లు

పట్టణంలో దశాబ్దాలుగా రోడ్లు మరమ్మతులకు నోచుకోలేదు. ఎన్ని ప్రభుత్వాలు, చైర్మన్లు మారినా రోడ్ల పరిస్థితి మారలేదు. ముఖ్యంగా ఆర్టీసీ బస్టాండ్ పక్కన ఉన్న వీధిలో రోడ్డు దాదాపు డిపో వరకు ఉంది. ఈరోడ్లలో నడిచేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పోస్టాఫీసు వద్ద రోడ్డు పూర్తిగా పాడైపోయింది. అక్కడి నుంచి దిగువకు నడవడానికి ఇబ్బందిగా ఉంటుంది. ఇక ద్విచక్రవాహనాలు వెళ్లడం అంటే నరకప్రాయమే. కొన్నేళ్లుగా రోడ్లు వేయకపోవడంతో పాటు నీటి కొళాయిల కోసం రోడ్డును తవ్వి అలాగే వదిలేశారు. దీంతో రోడ్డు ఎక్కడ చూసినా గుంతలే. అలాగే అడపాల వీధి, గాంధీనగర్, ఎన్‌జీవో కాలనీ, చౌక్‌లోని కొన్ని వీధుల్లో ఎక్కడ చూసిన గుంతలే దర్శనమిస్తున్నాయి.

వర్షాలు కురిస్తే ఇబ్బందులు

శివారు ప్రాంతాల్లో చినుకు పడితే రోడ్లన్నీ చిత్తడిగా మారుతున్నాయి. ముఖ్యంగా ఇందిరాకాలనీ, యర్రగుంటపల్లి రోడ్డు, కందికుంట నారాయణమ్మ కాలనీ, కుటాగుళ్ల తదితర ప్రాంతాల్లో పరిస్థితి మరీ దారుణం. అక్కడ నివ



గుంతలు పడిన పోస్టాఫీసు రోడ్డు

శించే ప్రజలు ఏమాత్రం నడవడానికి వీలు లేకుండా ఉంది. అనంతపురం రోడ్డు నుంచి యర్రగుంటపల్లికి వెళ్లే రోడ్డు వేసి 20 సంవత్సరాలు అవుతోంది. ఇంతవరకు రోడ్డు వేయలేదు. అక్కడ ప్రజలు ఎన్నోసార్లు ప్రజాప్రతినిధులకు తమ గోడు చెప్పుకున్నా ఫలితం లేకుండా పోయింది. 15వ ఆర్థిక ప్రణాళికలో రోడ్డు మరమ్మతులకు రూ.92 లక్షలు కేటాయించినా అవి నేటికీ విడుదల కాలేదు. ఇందిరా కాలనీలోని కొన్ని ప్రాంతాల్లో రోడ్లు లేకపోవడంతో వర్షం వస్తే బురదమయంగా మారుతోంది. కందికుంట నారాయణమ్మ కాలనీలో అనేక వీధుల్లో రోడ్లు నిర్మించాల్సి ఉంది. ఇంతవరకు ఎటువంటి పనులు మొదలు పెట్టలేదు. కుటాగుళ్లలో మెయిన్ రోడ్డు గుంతలమయం అయ్యింది. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పనులు మొదలుపెడతాం

- విజయకుమార్, మున్సిపల్ డీఈఈ

మున్సిపాలిటిలో ఉన్న రోడ్లలో 582 గుంతలు గుర్తించాం. వాటి మరమ్మతుకు టెండర్లు పిలిచాం. టెండర్లు ప్రక్రియ పూర్తయిన వెంటనే పనులు మొదులు పెడతాం. అదే విధంగా యర్రగుంటపల్లి నుంచి అనంతపురం రోడ్డు వరకు రోడ్డు వేయడానికి నిధులు ఉన్నాయి. త్వరలోనే రోడ్డు పనులు ప్రారంభిస్తాం.

ప్రధానోపాధ్యాయులకు శిక్షణ

నంబులపూలకుంట, జనవరి 2(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో గురువారం ఎంఈఓలు గోపాల్‌నాయక్, సుబ్బిరెడ్డి అధ్యక్షతన ప్రధానోపాధ్యాయులు, పాఠశాల కమిటీ చైర్మన్లకు శిక్షణ ఇచ్చారు. వారు మాట్లాడుతూ పాఠశాల విధివిధానాలు, బాలల హక్కులు, పాఠశాల అభివృద్ధి ప్రణాళిక, సమకాలీన సమస్యలపైన అవగాహన కల్పించామన్నారు. డీఆర్పీలు రామాంజనేయులు, బాబావలీ, రెడ్డెప్ప పాల్గొన్నారు.

దళితుల సమస్యలను పరిష్కరించండి

పుట్టపర్తి రూరల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఎస్పీ రత్నను ఏపీ ఎస్సీ కార్పొరేషన్ డైరక్టర్ బేకరి గంగాధర్ కోరారు. గురువారం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆయన డీపీఓలో ఎస్పీకి మొక్కను అందచేసి, దుశ్శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం వచ్చే దళితులకు న్యాయం చేయాలని ఎస్పీని కోరినట్లు తెలిపారు.

కబడ్డీ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ధర్మవరం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): అనంతపురంలోని ఆర్డీటీ స్టేడియంలో గత నెల 27 నుంచి 29వ తేదీ వరకు జరిగిన కబడ్డీ, క్రికెట్‌లో లీగ్ పోటీల్లో పట్టణంలోని కొత్తపేట బాలుర ఉన్నతపాఠశాల విద్యార్థులు ప్రతిభకనబరచినట్టు పాఠశాల హెచ్ఎం పద్మావతి తెలిపారు. క్రికెట్‌లీగ్ పోటీల్లో రాజా జిల్లాస్థాయిలో ఎంపికయ్యారన్నారు. కబడ్డీ పోటీల్లో జయంత్, యశ్వంత్, ఆసిఫ్, నూర్ అహమ్మద్, యేసురాజు, లోకేశ్, వంశీ, మనోహర్ రెడ్డి, నవదీప్‌లను హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

బాస్కెట్‌బాల్ పోటీల రన్నరప్‌గా ధర్మవరం జట్టు



రన్నరప్‌గా నిలిచిన బాలికల జట్టుతో కోచ్‌లు

ధర్మవరం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): చిత్తూరులోని పీఈఎస్ స్కూల్‌లో గత నెల 28, 29, 30 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో ధర్మవరం బాలికల జట్టు రన్నరప్‌గా నిలిచినట్టు ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. టోర్నీలో ధర్మవరం బాలికల జట్టు, చిత్తూరు జిల్లాకు చెందిన బంగారుపాలెం జట్టు తలపడగా బంగారు పాలెం జట్టు 36, ధర్మవరం జట్టు 34 పాయింట్లు సాధించి రన్నరప్‌గా నిలిచిందన్నారు. బాస్కెట్‌బాల్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షుడు మేడాపురం రామిరెడ్డి, సెక్రటరీ హిదయ్‌తుల్లా, కోచ్ సంజయ్, సీనియర్ క్రీడాకారులు బాలికలను అభినందించారు.

పోలీస్ రైటర్లలో కలకలం

● ఆరాతీసిన జిల్లా ఎస్పీ రత్న

హిందూపురం, జనవరి 2(ఆంధ్రజ్యోతి) : పోలీస్ స్టేషన్‌లో రైటర్లదే రాజ్యం అనే కథనం ఆంధ్రజ్యోతిలో గురువారం ప్రచురితమైన విషయం విదితమే. దీనిపై జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న రైటర్లలో కలకలం రేగింది. కొన్నిచోట్ల రైటర్లే కింగ్ మేకర్లుగా వ్యవహరిస్తూ స్టేషన్ బయట సెటిల్‌మెంట్లు చేస్తున్నారని, మరికొన్నిచోట్ల సీఐ, ఎస్ఐలను డమ్మి చేస్తున్నట్లు కథనంలో పేర్కొన్నారు. దీనిని జిల్లా ఎస్పీ రత్న సీరియస్‌గా పరిగణించి జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో రైటర్లపై ఆరాతీశారు. రైటర్లు స్టేషన్ బయట సెటిల్‌మెంట్‌లు చేసినట్లు తమ దృష్టికివస్తే చర్యలు కఠినంగా ఉంటాయని ఇదే విషయాన్ని సంబంధిత రైటర్లకు చెప్పాలని ఆదేశాలు అందాయి. ముఖ్యంగా హిందూపురం సబ్‌డివిజన్‌కు సంబంధించిన సీఐలు జిల్లా ఎస్పీని కలిశారు. ఈ సందర్భంగా హిందూపురం సబ్‌డివిజన్‌లో రైటర్ల వ్యవహారశైలిపై నిఘా వేయాలని ఆదేశించినట్లు సమాచారం. ఎక్కడైనా సీఐలు, ఎస్ఐలను డమ్మీ చేస్తున్నట్లు తమ దృష్టికి వస్తే కఠినంగా వ్యవహరిస్తానన్నారు. ఇందులో ఎవరు జోక్యం చేసుకున్నా ఉపేక్షించేది లేదని పోలీసు అధికారులను ఆదేశించినట్లు విశ్వసనీయ సమాచారం.

బీమాతో కుటుంబానికి భరోసా

గాండ్లపెంట, జనవరి 2(ఆంధ్రజ్యోతి): బీమాతోనే కుటుంబానికి భరోసా ఉంటుందని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ భరత్‌ప్రవీణ్ అన్నారు. గురువారం మల్లమీదపల్లిలోని మహిళా మండల సమాఖ్య సమావేశంలో బ్యాంక్ మేనేజర్, ఆర్థిక అక్షరాస్యత కౌన్సిలర్స్ వీరమారుతి, నారాయణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన ప్రీమియం రూ.20 చెల్లిస్తే ప్రమాదవశాత్తు మృతిచెందిన కుటుంబంలోని నామినీకి రూ.2 లక్షల బీమా వర్తిస్తుందన్నారు. అలాగే ప్రధానమంత్రి జీవన జ్యోతియోజన ప్రీమియం యేడాదికి రూ.436 చెల్లించి 18 సంవత్సరాల నుంచి 50 లోపు ఉన్నవారు సాధారణ మరణం చెందినా నామినీకి రూ.2లక్షలు బీమా వర్తిస్తుందన్నారు. సమావేశంలో బ్యాంక్ కరస్పాండెంట్ శ్రీనివాసులు, యానిమేటర్ వీరప్ప పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కదిరి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మెప్మా ఆధ్వర్యంలో వివిధ వృత్తులలో నైపుణ్యాభివృద్ధి శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కమిషనర్ కిరణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని మహిళా సంఘాల్లో సభ్యులు, వారి కుటుంబ సభ్యులు గృహోపకరణాల తయారీ, చేత వృత్తుల్లో పనిచేస్తున్న వారికి వృత్తి నైపుణ్యాభివృద్ధి కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏసీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మిషన్, గీజర్ తదితర వాటికి మరమ్మతులు, వడ్రంగి, సెలూన్, బ్యూటీషియన్ తదితర వృత్తుల్లో నైపుణ్యం పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. 16వ తేదీలోగా మున్సిపాలటీలోని మెప్మా విభాగంలో దరఖాస్తులు అందచేయాలన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎంపీపీ ఆదినారాయణ యాదవ్

ముదిగుబ్బ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన పల్లెపండుగ గ్రామాభివృద్ధిలో భాగంగా మండలపరిధిలోని బి.కొట్టాల గ్రామంలో గురువారం ఎంపీపీ ఆదినారాయణయాదవ్ సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. రోడ్డు నిర్మాణానికి రూ.5లక్షలు నిధులు మంజూరుచేశారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ మండల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నారని ఎంపీపీ అన్నారు. కార్యక్రమంలో అధికారులు, గొడుగు అమీర్, సంద్రరాజా, భాస్కర్‌నాయక్ పాల్గొన్నారు.

ప్రజారక్షణలో పోలీస్ మార్క్ కనిపించాలి

● ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి



ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఏఎస్పీ, డీఎస్పీలు

పుట్టపర్తిరూరల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): నూతనసంవత్సరంలో న్యాయంకోసం పోలీసుస్టేషన్లకు వచ్చే ప్రజల సమస్యలకు పరిష్కారం చూపి, పోలీస్ మార్కు కనిపించాలని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి పోలీసు అధికారులకు సూచించారు. గురువారం అనంతపురంలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యేను కలిసిన పోలీసు అధికారులు ఎమ్మెల్యే, మాజీమంత్రి పల్లెరఘునాథరెడ్డికి పూలమొక్కలను అందచేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజలు శాంతియుత జీవనం గడిపేలా పోలీసులు కృషి చేయాలన్నారు. న్యాయం కోసం పోలీసుస్టేషన్‌కు వచ్చే ప్రజల పట్ల సహృదయంతో వ్యవహరించి న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఎమ్మెల్యే భర్త పల్లె వెంకటకృష్ణ కిశోర్ రెడ్డి, ఎమ్మెల్యే కేరళ మాజీ డీజీపీ శంకరరెడ్డి, అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, డీఎస్పీ విజయ్‌కుమార్, సీఐలు సునీత, నరేంద్రరెడ్డి, సురేష్, ఇందిర, ఎస్సైలు లింగన్న, మల్లికార్జునరెడ్డి, వెంకటనారాయణ, దాదాపీర్, కృష్ణమూర్తి, శ్రీరాములు, సూర్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఎస్పీ శుభాకాంక్షలు



కలెక్టర్‌కు పుష్పగుచ్చం అందజేస్తున్న ఎస్పీ

పుట్టపర్తిరూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని కలెక్టర్ టీఎస్ చేతన్‌కు ఎస్పీ ఎ. రత్న శుభాకాంక్షలు తెలిపారు. గురువారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు.

నూతనోత్సాహంతో పనిచేయాలి: ఎస్పీ



ఎస్పీకి శుభాకాంక్షలు తెలుపుతున్న ఏఎస్పీ, డీఎస్పీలు

పుట్టపర్తిరూరల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరంలో నూతనోత్సాహంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలందించాలని ఎస్పీ రత్న పోలీసు అధికారులకు సూచించారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో అదనపు ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, డీఎస్పీలు,సీఐలు, ఎస్సైలు, సిబ్బంది ఎస్పీని కలసి పూలబొకేలు అందచేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ.. నూతన సంవత్సరంలో నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకునే విధంగా పనిచేయాలన్నారు. అసాంఘిక కార్యాకలాపాలకు అడ్డుకట్ట వేయాలని, చెక్‌పోస్టుల వద్ద మరింత నిఘా పెట్టాలని ఆదేశించారు. సైబర్‌నేరాలు, పూర్తిగా అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. మత్తుపదార్థాల నియంత్రణపై పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కేక్‌కట్ చేసి, సిబ్బందికి నూతన వస్త్రాలను అందచేశారు. డీఎస్పీలు విజయ్‌కుమార్, శివన్నారాయణస్వామి, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, ఎస్పీ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, డీసీఆర్బీ సీఐ శ్రీనివాసులు, ఏఓ సుజాత, సూపరింటెండెంట్ సరస్వతి, ఆర్ఐలు మహేష్, వలి పాల్గొన్నారు.

పాఠశాలలో క్షుద్రపూజల కలకలం

● భయపెట్టేందుకే: కునుకుంట్ల గ్రామస్థులు



పాఠశాల ఆవరణలో చేసిన క్షుద్రపూజలు

తాడిమర్రి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కునుకుంట్ల పాఠశాలలో క్షుద్రపూజలు కలకలం రేపాయి. బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పాఠశాల ఆవరణలో ఎనుముకు సంబంధించిన పుర్రె, కాళ్ల ఎముకలు ముగ్గుపై ఉంచి పసుపు కుంకుమ చల్లి క్షుద్రపూజలు నిర్వహించారు. గురువారం ఉదయం పాఠశాల వాచ్‌మన్ యేసయ్య విషయాన్ని గమనించి హెచ్ఎం లక్ష్మన్న, గ్రామస్థులకు సమాచారం అందించారు. గ్రామస్థులు అక్కడికి చేరుకుని క్షుద్రపూజల గురించి ఆరాతీశారు. అయితే నిజంగా క్షుద్రపూజలు జరిగి ఉంటే రక్తపు మరకలు ఆ ప్రాంతంలో పడి ఉంటాయి. కానీ అవి ఎక్కడా కనిపించలేదు. దీంతో పాఠశాలలోని ఉపాధ్యాయులను, విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేసేందుకే ఎవరో ఈపని చేసి ఉంటారని గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తాడిమర్రి ఎస్ఐ కృష్ణవేణికి హెచ్ఎం ఫిర్యాదు చేశారు.

నాడు-నేడు తీగలే కారణమా?

గత ప్రభుత్వ హయాంలో నాడు-నేడు పథకం కింద విద్యుత్ కనెక్షన్‌లు ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరయ్యాయి. దీనికి అవసరమయ్యే రూ.50వేలు విలువ చేసే వైరుకూడా తెచ్చిపాఠశాలలో భద్రపరిచారు. పదిరోజుల క్రితం ఆ వైరు దుండగులు దొంగలించారు. విషయాన్ని గమనించిన టీచర్లు పోలీసులకు సమాచారం ఇవ్వకపోగా ఎవరు చేసి ఉంటారనే ఆరాతీసే పనిలో పడ్డారు. చివరికి పాఠశాలలో పనిచేసే వ్యక్తి ఈ పనిచేసి ఉంటాడని గ్రామస్థులు ఒక నిర్ణయానికి వచ్చారు. అది పూర్తి కాకుండానే పాఠశాలలో క్షుద్రపూజలు జరగడం పలు అనుమానాలకు తావిస్తోంది.

ఉచిత కంటి వైద్య శిబిరం

ఓబుళదేవరచెరువు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇగనలూరు గ్రామంలో గురువారం పీస్ వెల్ఫేర్ సద్గురుసేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 117 మందికి కంటి పరీక్షలు చేసి, అవసరమైన వారికి శస్త్రచికిత్సలకు సిపార్సు చేశారు. వైద్యుడు బొగ్గు సురేష్, సిబ్బంది సుధాకర్, సాయిమోహన్, యాస్మిన్, శ్రావణి, పాల్గొన్నారు.

ఎటు చూసినా చెత్తే..!

- తుప్పుపట్టిన చెత్తసేకరణ వాహనాలు
- మరమ్మతులకు నోచుకోని ట్రాక్టర్లు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు

కొత్తచెరువు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో ఏ వీధిలో చూసినా రోడ్లపైనే చెత్త దర్శనమిస్తోంది. పంచాయతీలో రెండు ట్రాక్టర్‌లున్నా కొన్ని ప్రధాన వీధులలో మాత్రమే చెత్తను సేకరిస్తున్నాయి. మిగిలిన రెండు ట్రాక్టర్‌లు మరమ్మతులకు గురికావడంతో వాటిని నాలుగేళ్లగా మూలనపడేశారు. ఉన్న చెత్త సేకరణ సైకిళ్లను కూడా ఉపయోగించకపోవడంతో అవి కూడా తుప్పుపట్టి శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో చెత్త సేకరణ వీధులలో చేయకపోవడంతో ఏ వీధిలో చూసినా రోడ్లపై, పక్కన చెత్త పేరుకుపోయి దిబ్బలా తయారవుతున్నాయి. ముస్లిం కాలనీ, విజయనగర కాలనీ, బీసీ కాలనీ తదితర ప్రాంతాలలో చెత్త తీయకపోవడంతో కుళ్లి దుర్వాసన వస్తోందని కాలనీల ప్రజలు వాపోతున్నారు. ఖాళీ స్థలాల్లో స్థానికులు చెత్త, చనిపోయిన కుక్కల కళేబరాలను పడేస్తున్నారు. వాటి నుంచి వచ్చే దుర్వాసనను భరించలేకపోతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విషయాన్ని



ఉర్దూ పాఠశాల వద్ద పేరుకుపోయిన చెత్త

పంచాయతీ సిబ్బందికి తెలియజేసినా పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి వీధుల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

బియ్యం కోసం లబ్ధిదారుల పడిగాపులు



స్టోర్ల వద్ద బియ్యం కోసం వేచివున్న లబ్ధిదారులు

కొత్తచెరువు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో చౌక బియ్యం కోసం లబ్ధిదారులు పడిగాపులు కాస్తున్నారు. బోయవీధిలోని ఓ చౌకదాన్యపు దుకాణం వద్ద లబ్ధిదారులు వేచి ఉన్న పరిస్థితి గురువారం కనిపించింది. లబ్ధిదారులను అడగ్గా నిత్యావసర సరుకులు తీసుకోవాలంటే తాము పనులు వదులుకుని స్టోరు వద్ద పడిగాపులు పడాల్సిన పరిస్థితి ఉందన్నారు. ముఖ్యంగా సర్వర్‌లు పనిచేయకపోతే ఆ రోజు తిరిగి ఇంటికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంటోందని లబ్దిదారులు వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి లబ్ధిదారులకు సక్రమంగా నిత్యావసర వస్తువులు అందేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

వైభవంగా శ్రీనివాసునికి పుష్పయాగం



స్వామివారికి పుష్పయాగం నిర్వహిస్తున్న దృశ్యం

హిందూపురం అర్బన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): శ్రీ మహావిష్ణువుకు ప్రీతిపాత్రమైన మార్గశిరమాసంలో గోవిందమాల ధరించిన భక్తులు మునిసిపల్ కార్యాలయం వద్దగల వేంకటేశ్వరుని ఆలయంలో గురువారం పుష్పయాగం నిర్వహించారు. బెంగళూరు నుంచి ప్రత్యేకంగా తెప్పించిన వివిధ రకాల పూలతో భక్తులు పట్టణంలో ఊరేగింపుగా తరలివెళ్లారు. గోవిందనామ స్మరణతో పురవీధులు మార్మోగాయి. భజనలు, కీర్తనలతో భక్తులు పులకించిపోయారు. అనంతరం పుష్పయాగంలో మూలవిరాట్‌కు పుష్పాలను సమర్పించి భక్తిని చాటుకున్నారు. కార్యక్రమంలో గోవింద మాలధారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ విస్తరణ వివాదాలను పరిష్కరించాలి

గోరంట్ల, జనవరి2(ఆంధ్రజ్యోతి):ముదిగుబ్బ నుంచి కోడూరు వరకు జరుగుతున్న ఎన్‌హెచ్ 342 రోడ్డు విస్తరణ పనులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆదేశించారు. గోరంట్ల మండలంలోని మందపల్లి గ్రామ సచివాలయంలో జరిగిన రెవిన్యూ గ్రామసభకు గురువారం ఆయన హాజరయ్యారు. పలు వివాదాలు, కోర్టు సమస్యలు, తదితర కారణాలతో జాతీయ రహదారి విస్తరణ పనులు సజావుగా సాగకుండా అక్కడక్కడ ఆగిపోయాయి. మందలపల్లి వద్దనుంచి కరావులపల్లి క్రాస్ వరకు పనులకు అవరోధం ఏర్పడింది. దీంతో గ్రామసభద్వారా సంబంధిత రైతులతో జేసీ నేరుగా సమావేశంలో మాట్లాడారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని రెవిన్యూ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణపరతి, తహసీల్దార్ మారుతి, సర్పంచ్ ప్రమీల, సర్వేయర్ సుజాత, విఆర్‌ఓ పవన్, రైతులు పాల్గొన్నారు.

స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలకు శిక్షణ

గోరంట్ల, జనవరి2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉర్దూ ఉన్నతపాఠశాలలో 101 పాఠశాల ఎస్ఎంసి ఛైర్మన్లు, హెచ్ఎంలు, రీసోర్సు పర్సన్లకు గురువారం అధికారులు శిక్షణ ఇచ్చారు. ఎంఈఓలు జనార్ధ్‌రెడ్డెప్ప, గోపాల్, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల విధులు, బాధ్యతల గురించి వివరించారు. ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి, మౌలిక సదుపాయల కల్పన, మధ్యాహ్న భోజన పథకం అమలు, విద్యాభివృద్ధికోసం ఎస్ఎంసీల సహకారం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో రీసోర్సు పర్సన్లు నరేంద్రరెడ్డి, నాగరాజు, చంద్రశేఖర్, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎట్టకేలకు రహదారికి మోక్షం



అధికారులు దగ్గరుండి దారిని ఏర్పాటు చేయిస్తున్న దృశ్యం

పెనుకొండ టౌన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో పలు గ్రామాలకు వెళ్లే దారులను మూసేసి రియల్టర్లు వేరే దారి ఏర్పాటుచేశారు. దీనిపై స్పందించిన రెవెన్యూ అధికారులు.. పోలీసుల సమక్షంలో గురువారం పాత దారిని తిరిగి ఏర్పాటు చేశారు. అనంతవరం అధికారులు మాట్లాడుతూ, పెనుకొండ నుంచి కోనాపురం, మంగాపురం, కొండాపురం గ్రామాలకు వెళ్లేదారి రికార్డుల ప్రకారం ఉందన్నారు. రియల్టర్లు అది మూసేసి స్వలాభానికి వేరేదారిని ఏర్పాటు చేశారన్నారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు పూర్వపురికార్డులు పరిశీలించి యథావిధిగా దారి కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్ శ్రీనివాసులు, ఆర్ఐ భాస్కర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయానికి విరాళం



విరాళం అందజేస్తున్న టీడీపీ నాయకురాలు రమణమ్మ

పెనుకొండ టౌన్, జనవరి2(ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వామి ఆలయ అభివృద్ధికి టీడీపీ పట్టణ మహిళా అధ్యక్షురాలు రమణమ్మ రూ.30వేలు విరాళం అందించారు. గురువారం స్థానిక సీఐ కార్యాలయం సమీపంలో భజన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె గురుస్వాములకు నగదును అందజేశారు.

10న ఉత్తర ద్వార దర్శనం

హిందూపురం అర్బన్,జనవరి 2(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని మహిమాన్విత పుణ్యక్షేత్రం గుడ్డం రంగనాథస్వామి ఆలయంలో ముక్కోటి వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని ఉత్తర ద్వారం తెరవనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు గోవిందశర్మ, ఈఓ నాగేంద్రుడు తెలిపారు. ఈ నెల 10వతేదీ ఉదయం ఉత్తర ద్వారానికి పూజలు చేసి స్వామివారిని దర్శించుకునే అవకాశాన్ని కల్పిస్తామన్నారు.

మండల స్థాయి సైన్స్ ఫెయిర్



సైన్స్ ఫెయిర్‌ను సందర్శిస్తున్న ఎంఈఓ లక్ష్మీదేవి

పరిగి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): సేవామందిరం ఉన్నత పాఠశాలలో గురువారం మండలస్థాయి సైన్స్ ఫెయిర్ జరిగింది. ఇందులో భాగంగా ధనాపురం ఉపాధ్యాయురాలు సుకన్యను, నర్సాపురం విద్యార్థి ప్రత్యూషను, గ్రూప్ సైన్స్‌ఫేర్‌లో విద్యార్థినులు మంజుల, మానసలను ఎంఈఓ లక్ష్మీదేవి ఎంపిక చేశారు. సంస్కృతి ఇంజనీరింగ్ కళాశాల పుట్టపర్తిలో శుక్రవారం జరిగే సైన్స్‌ఫేర్‌లో ఎంపికైన ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొంటారని ఎంఈఓ తెలిపారు.

సైకిల్‌పై రైతురత్న

- ప్రకృతి వ్యవసాయంలో రైతన్నలకు ఆదర్శం
- చంద్రబాబు నుంచి అవార్డు పొందిన నారాయణప్ప
- పండించిన పండ్లకు మార్కెటింగ్ ఆయన ప్రత్యేకత



మడకశిర రూరల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మడకశిర మండలం మెళవాయి గ్రామానికి చెందిన రైతు నారాయణప్పకు ఓ ప్రత్యేకత ఉంది. అందుకే కేవలం ఎకరా పొలంలోనే పాలేకర్ పద్ధతిలో అనేక రకాల పంటలను పండిస్తూ ఎంతో మంది రైతులకు ఆదర్శంగా నిలబడ్డారు. అంతేనా అంటారా? ఆగండాగండి.. సహజంగా రైతులకు పంటలను పండించడమేకాని వాటిని మార్కెటింగ్ చేసుకోవడం తెలియదు. సేంద్రియ వ్యవసాయం చేస్తున్న నారాయణప్ప మార్కెటింగ్‌లో దిట్ట. తాను పండించిన పంటను అమ్ముకోవడం



2017లో సీఎం చంద్రబాబు నుంచి అందుకున్న రైతురత్న అవార్డు జ్ఞాపిక

నారాయణప్పకు తెలిసినట్టుగా ఇతరులెవరికీ తెలియదు. రసాయన ఎరువులు వాడకుండా సేంద్రీయ వ్యవసాయ పద్దతుల్లో వివిధ రకాల పండ్లను పండించడమేకాదు.. వాటిని సైకిల్‌పై పట్టణానికి తీసుకువెళ్ళి 'సేంద్రియ పండ్లు' అనే పేరుతో తగిన ధరకు అమ్ముకుని వచ్చిన ఆదాయంతో కుటుంబ పోషణచేయడమే ఆయన విలక్షణ పద్ధతి.

రైతునారాయణప్ప మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం పెట్టుబడిలేని ప్రకృతి వ్యవసాయానికి పెద్దపీట వేసిందన్నారు. తనకు ఉన్న ఎకరా భూమిలో మొక్కలు పెంచడానికి అప్పటి ప్రభుత్వం మామిడి, సపోట, జామ, నేరేడు తదితర మొక్కలను ఉచితంగా అందించిందన్నారు. వాటికితోడు చింత, పనస, సీతాఫలం మొక్కలు కూడా నాటాన్నారు. తనకు వ్యవసాయ బోరు లేకపోవడంతో పొలంసమీపంలో ప్రభుత్వం వారు తాగునీటికి వేసినబోరు నుంచి సైకిల్‌పై బిందెలతో నీటిని తీసుకువచ్చి మొక్కలను పెంచినట్లు తెలిపారు. రసాయన ఎరువులు వాడకుండా సేంద్రియ వ్యవసాయపద్దతు లతో సాగుచేయడంతో మంచి దిగుబడి వచ్చిందన్నారు. పండిన వాటినిసైకిల్‌పై తీసుకు వెళ్ళి పట్టణంలో అమ్ముతున్నట్టు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న అప్పటి రాష్ట్ర వ్యవసాయ కమిషనర్ విజయకుమార్ స్వయంగా పొలం వద్దకు వచ్చి సేంద్రీయ వ్యవసాయ పద్దతులో సాగుచేసిన పండ్ల తోటను, పంటను పరిశీలించారని తెలిపారు.

2016లో తూర్పు గోదావరిలో పెట్టుబడిలేని ప్రకృతి వ్యవసాయ పై రైతులతో సభలు నిర్వహించారని, అందులో తాను పాల్గొని తాను అనుసరిస్తున్న పద్దతుల గురించి రైతులకు వివరించానని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ పితామహుడు సుభాష్ పాలేకర్ నుంచి ప్రశంసా పత్రాన్ని అందుకొన్నట్టు పేర్కొన్నారు. 2017లో విజయవాడలో జరిగిన రైతు సదస్సులో ప్రకృతి వ్యవసాయంలో ఆదర్శంగా నిలబడిన తనకు అప్పటి ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు రైతు రత్న అవార్డు అందించినట్లు తెలిపారు. దీంతో మళ్ళీ కమిషనర్ విజయకుమార్ తమ గ్రామానికి వచ్చి పంట సాగును పరిశీలించారు. పంట సాగుకు నీటి కోసం తాను పడుతున్నా బాధలు చూసి వ్యవసాయబోరు వేయిస్తున్నానని హామీ ఇచ్చారన్నారు. అప్పట్లో ప్రభుత్వం మారడంతో తనకు నిరాశే మిగిలిందని, మళ్ళీటీడీపీ ప్రభుత్వం వచ్చింది కనుక తనకు వ్యవసాయబోరు వేయించాలని కోరుతున్నానన్నారు.

ప్రకృతి వ్యవసాయంలో నారాయణప్ప దిట్ట



ప్రకృతి వ్యవసాయంలో రైతు నారాయణప్ప మార్గం అందరికీ అనుసరణీయం. ఆయన తనకు ఉన్న తక్కువ పొలంలోనే ప్రకృతి వ్యవసాయంలో మామిడి, సపోటా, జామ, సీతాఫలం వంటి పండ్ల మొక్కలను సేంద్రియ ఎరువులతో పెంచుతున్నాడు. అంతే కాకుండా వాటిని సైకిల్‌పై తిరిగి ఆ పేరుతో తగిన ధరకు అమ్ముకోగలుగుతున్నాడు.

రమేష్, డివిజనల్ వ్యవసాయ అధికారి

5న పెనుకొండకు కేంద్ర మంత్రి సోమణ్ణ రాక : బీకే

పెనుకొండ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): పెనుకొండలోని రైల్వేగేటుపై కొత్తగా నిర్మించిన ఫ్లైఓవర్ బ్రిడ్జి ఈనెల 5న ప్రారంభిస్తున్నామని ఈ కార్యక్రమానికి కేంద్ర రైల్వేశాఖ సహాయ మంత్రి సోమణ్ణ హాజరవుతున్నట్లు హిందూపురం పార్లమెంట్ సభ్యులు బీకే పార్థసారథి తెలిపారు. గురువారం స్థానిక ఎంపీ కార్యాలయంలో బ్రిడ్జి ప్రారం



మాట్లాడుతున్న బీకే పార్థసారథి

భోత్సవ కార్యక్రమ ఏర్పాట్లపై రైల్వేశాఖ అధికారులు ఎంపీని కలిసి చర్చించారు. అనంతరం ఎంపీ విలేకరులతో మాట్లాడుతూ పెనుకొండ పట్టణం రైల్వేగేటుపై రూ.25కోట్లతో నిర్మించిన ఫ్లైఓవర్ బ్రిడ్జిని ఈనెల 5న ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా రైల్వే శాఖ సహాయమంత్రి సోమణ్ణ హాజరై బ్రిడ్జిని ప్రారంభిస్తారన్నారు. సోమందేపల్లి మండలం చాకర్లపల్లి రైల్వే గేటుపై నిర్మిస్తున్న బ్రిడ్జి అర్ధాంతరంగా ఆగిపోయిందన్నారు. జగన్ సర్కార్ నిర్లక్ష్యం వల్లే ఇది జరిగిందన్నారు. బ్రిడ్జి నిర్మాణానికి రాష్ట్రం వాటా నిధులు ఇవ్వకపోవడంతోనే పనులు ఆగిపోయాయన్నారు. ఈ విషయాన్ని రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళ్లి నిర్మాణ పనులు పూర్తిచేయించామన్నారు. పురం పార్లమెంట్ పరిధిలోనిరైల్వే స్టేషన్లలో సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరించేందుకు కృషిచేస్తామన్నారు.

జగన్ పాలనలో రాష్ట్రం దోపిడీ

ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

రొళ్ల/మడకశిర టౌన్/అగళి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం దోపిడీకి గురైందని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు విమర్శించారు. రొళ్ల మండంలోని గుడ్డుగురికి గ్రామంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆయన హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. వైసీపీ హయాంలో రైతుల పాసుపుస్తకంపై జగన్ ఫొటో వేసుకుని ప్రజలు భూహక్కులు కోల్పోయేలా వ్యవహరించారన్నారు. కూటమి అధికారంలోకి రాగానే ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులను నిర్వహించి సమస్యలను పరిష్కరిస్తోందన్నారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి డైరెక్టర్ ఈడిగ రమేష్‌గౌడ్, కాంతరాజు, ముద్దేగౌడ ఆధ్వర్యంలో నిర్మించిన వాటర్‌ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు.

టీడీపీ తీర్థం పుచ్చుకున్న 120 కుటుంబాలు

రొళ్ల మండలం కాకి పంచాయతీకి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ సర్పంచ్ తిమ్మేగౌడ్, సిద్దప్ప, ఉప సర్పంచ్ రాజు, రిటైర్డ్ టీచర్ శివలింగప్ప, పరమేశ్వరప్పతోపాటు 120కుటుంబాలు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. వీరికి ఎమ్మెల్యే టీడీపీ కండువావేసి, సాదరంగా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

పార్టీలోకి ఆహ్వానించారు.

తల్లిదండ్రుల సమావేశానికి హాజరు

అగళిలోని మోడల్ పాఠశాలలో నిర్వహించిన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశానికి ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. విద్యార్థులు ఇష్టపడి చదివితేనే బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. ఆదర్శ పాఠశాలలో 546మందికిగాను 141 మంది హాజరు కాకపోవడం బాధాకరమన్నారు.

బార్ అసోసియేషన్‌లో రచ్చ

- అధ్యక్షుడిని నిలదీసిన న్యాయవాదులు
- నా గొంతు మార్ఫింగ్ చేసి ప్రచారం..
- టూటౌన్‌లో న్యాయవాది రాము ఫిర్యాదు
- కొనసాగిన న్యాయవాదుల నిరసన
- రేపటి వరకు విధుల బహిష్కరణ



అనంతపురంలో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

అనంతపురం క్రైం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): బార్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం రచ్చగా మారింది. సీనియర్ న్యాయవాది శేషాద్రి మృతిపై తాము చేస్తున్న ఆందోళనలకు ఎందుకు మద్దతివ్వడం లేదని జిల్లా అధ్యక్షుడిని న్యాయవాదులు ప్రశ్నించారు. జిల్లా కోర్టు ఆవరణంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో అధ్యక్షుడు గురుప్రసాద్, ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు అధ్యక్షుడికి పలు ప్రశ్నలు సంధించారు. కొన్ని రోజులుగా తాము నిరసనలు చేస్తుంటే ఎందుకు భాగస్వామ్యం కాలేదని ప్రశ్నించారు. పోలీసులకు అనుకూలంగా ప్రవర్తిస్తున్నారంటూ మండిపడ్డారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా.. న్యాయవాది పోలీస్‌స్టేషన్‌లో మృతి చెందితే ఆ కుటుంబానికి ఎందుకు అండగా నిలబడటం లేదని నిలదీశారు. 'మీరున్నా లేకపోయినా మేము ముందుండి ఉద్యమాన్ని నడిపిస్తాం' అని స్పష్టం చేశారు. శేషాద్రి కుటుంబానికి న్యాయం చేసేవరకు పోరాడుతామని తెలిపారు. ఈనెల 4వతేదీ వరకు విధులు బహిష్కరించడంతో పాటు నిరసనలు కొనసాగేలా సమావేశంలో తీర్మానించారు. అదే రోజు మరోసారి జనరల్ బాడీ సమావేశం నిర్వహించనున్నట్లు న్యాయవాదులు తెలిపారు.

నా గొంతును మార్ఫింగ్ చేశారు...

తన గొంతు మార్ఫింగ్ చేసిన ఆడియో రికార్డింగ్ ఒకటి తనకు తెలియకుండా ప్రచారం చేశారని న్యాయవాది రాము ఆరోపించారు. ఈ మేరకు వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆయన గురువారం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత నెల 29న ఉదయం తాను డీఎస్పీతో సంభాషించినట్లు ఆడియో రికార్డింగ్ వాట్సాప్‌లో గ్రూప్‌లో వచ్చిందన్నారు. ఎవరో తన గొంతుని మార్ఫింగ్ చేసి ప్రచారం చేశారని పేర్కొన్నారు. దీనివల్ల న్యాయవాదుల సమాజంలో తన పరువుకు భంగం కలుగుతోందని పేర్కొన్నారు. తన సీనియర్ న్యాయవాది శేషాద్రి మరణం విషయంలో పోలీసులకు అనుకూలంగా ఉండేలా ఎవరో ఉద్దేశపూర్వకంగా ఇలా చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తనకు వ్యక్తిగతంగా, సామాజికంగా నష్టం చేకూర్చారని పేర్కొన్నారు. విచారణ చేసి బాధ్యులపై కేసు నమోదు చేయాలని, తనకు న్యాయం చేయాలని కోరారు.

కొనసాగిన న్యాయవాదుల నిరసన

న్యాయవాది శేషాద్రి మృతిపై విచారణ చేయాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. జిల్లా కోర్టు ఎదుట న్యాయవాదులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. శేషాద్రి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గోవిందరాజులు, న్యాయవాదులు వెంకటరాముడు, నారాయణరెడ్డి, మేడా అనూరాధ, ధర్మసింగ్ నాయక్, సాకే నరేష్, బాలకృష్ణ, బాబాఫకృద్దీన్, రాఘవేంద్ర, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శించిన కర్నూలు న్యాయవాదులు

న్యాయవాది శేషాద్రి కుటుంబాన్ని కర్నూలు జిల్లా న్యాయవాదులు పరామర్శించారు. కర్నూలు, డోన్, పత్తికొండకు చెందిన న్యాయవాదుల సంఘం ప్రతినిధులు గోపాలకృష్ణుడు, ప్రభాకర్, ఆనంద్, వీరేష్, వేణుగోపాల్, వాల్మీకి అర్జున్, రంగస్వామినాయుడు, నాగేంద్రుడు, రామయ్య, బాలకృష్ణ తదితరులు శేషాద్రి కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు.

భక్తుల కొంగుబంగారం సుబ్రహ్మణ్యేశ్వరుడు

● నేటి నుంచి జాతర ● 5న బ్రహ్మరథోత్సవం

పావగడ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): నాగలమడకలో కొలువుదీరిన అంతె సుబ్రమణ్య ఉత్సవాలు శుక్రవారం నుంచి 15వ తేదీ వరకు వైభవంగా జరుగనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు బద్రినాథ్, ఈఓ తెలిపారు.



5న బ్రహ్మరథోత్సవం

నాగులమడక సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయ బ్రహ్మరథోత్సవం ఈనెల 5న వైభవంగా జరుగనుంది. మధ్యాహ్నం 12గంటలకు దేవాదాయశాఖ ప్రధాన అర్చకులు రథోత్సవాన్ని ప్రారంభించనున్నారు.

ఆలయ పునరుద్ధరణకు శ్రీకారం

దాదాపు 200ఏళ్ల క్రితం నిర్మించిన ఈ పురాతన ఆలయం నూతన భవన నిర్మాణానికి దేవాదాయశాఖ కమిషనర్ నుంచి శ్రీకారం చుట్టారు. ఈ గర్భగుడితోపాటు నూతన ఆలయ నిర్మాణానికి కూడా రూ.10కోట్ల నిధులతో శ్రీకారం చుట్టినట్లు అధికారులు వెల్లడించారు.

పుల్లి విస్తర నిషేధం కొనసాగింపు

బ్రహ్మరథోత్సవం రోజున పుల్లివిస్తర్లను నెత్తిన పెట్టుకుని కోనేటిలో మునిగితే చెవినొప్పి, చెవిలో చీముకారడం, సర్పదోషాలు వైదొలుగుతాయని భక్తుల అపారనమ్మకం. అయితే ఎంగిలి విస్తరులను మోయడం తప్పని హైకోర్టుకు అర్జీ అందించడంతో పుల్లివిస్తరలు మోయడం నిషేధించారు.

పీహెచ్‌సీల్లో జిల్లా వైద్యాధికారి తనిఖీలు

హిందూపురం అర్బన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): పట్టణ, మండల పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రా(పీహెచ్‌సీ)లను జిల్లా వైద్యాధికారి మంజువాణి గురువారం తనిఖీ చేశారు. హిందూపురం లక్ష్మీపురం పిహెచ్‌సీని, మండల పరిధిలోని బేవనహళ్ళి ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేసి ల్యాబ్‌లు, ఫార్మసీ, డెలివరి వార్డు తదితర విభాగాలను పరిశీలించారు. జాతీయ కార్యక్రమాలపై సూచనలు సలహాలు అందించారు. గర్భవతులకు టీకాలు తదితర విషయాలు అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా పారా మీటర్లు వందశాతం అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో బేవనహళ్ళి వైద్యులు షిఫా, జయానంద్‌నాయక్, లక్ష్మీపురం ఆరోగ్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

పోలీస్ రైటర్లలో కలకలం

● ఆరాతీసిన ఎస్పీ రత్న

హిందూపుం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): పోలీస్ స్టేషన్‌లో రైటర్లదే రాజ్యం అనే కథనం ఆంధ్రజ్యోతిలో గురువారం ప్రచురితమైన విషయం విధితమే. దీనిపై జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న రైటర్లలో కలకలం రేగింది. కొన్నిచోట్ల రైటర్లే కింగ్ మేకర్లుగా వ్యవహరిస్తూ స్టేషన్ బయట సెటిల్‌మెంట్లు చేస్తున్నారని, మరికొన్నిచోట్ల సీఐ, ఎస్ఐలను డమ్మీ చేస్తున్నట్లు కథనంలో పేర్కొన్నారు. దీనిని జిల్లా ఎస్పీ రత్న సీరియస్‌గా పరిగణించి జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో రైటర్లపై ఆరాతీశారు. రైటర్లు స్టేషన్ బయట సెటిల్‌మెంట్‌లు చేసినట్లు తమ దృష్టికివస్తే చర్యలు కఠినంగా ఉంటాయని ఇదే విషయాన్ని సంబంధిత రైటర్లకు చెప్పాలని ఆదేశాలు అందాయి. ముఖ్యంగా హిందూపురం సబ్‌డివిజన్‌కు సంబంధించిన సీఐలు జిల్లా ఎస్పీని కలిశారు. ఈ సందర్భంగా హిందూపురం సబ్‌డివిజన్‌లో రైటర్ల వ్యవహారశైలిపై నిఘా వేయాలని ఆదేశించినట్లు సమాచారం. ఎక్కడైనా సీఐలు, ఎస్ఐలను డమ్మీ చేస్తున్నట్లు తమ దృష్టికి వస్తే కఠినంగా వ్యవహరిస్తానన్నారు. ఇందులో ఎవరు జోక్యం చేసుకున్నా ఉపేక్షించేది లేదని పోలీసు అధికారులను ఆదేశించినట్లు విశ్వసనీయ సమాచారం.

ప్రధానోపాధ్యాయులకు శిక్షణ

అగళి, జనవరి 2(ఆంధ్రజ్యోతి) : అగళి మండల కేంద్రంలోని ఆర్డీటి భవనంలో గురువారం పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులకు, ప్రధానోపాధ్యాయులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణా తరగతుల్లో ఎంఈఓ-2 చంద్రశేఖర్‌నాయుడు మాట్లాడారు. పాఠశాలలు ఏ విధంగా పర్యవేక్షించాలో, ప్రధానోపాధ్యాయులు విధులు ఏవిధంగా నిర్వహించాలో వివరించారు. ఈనెల 6న స్కూల్ లెవెల్ ట్రైనింగ్ జరపాలని ఎంఈఓ సూచించారు. ప్రతిఒక్కరూ పాఠశాల నిర్వహణను బాధ్యతగా తీసుకుని విద్యార్థులకు చదువు అందించాలన్నారు. మధ్యాహ్న భోజనం హాజరు తదితర వాటిని సక్రమంగా అమలు చేయాలన్నారు. ఈ శిక్షణ తరగతుల్లో ప్రధానోపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యం కమిటీ సభ్యులు ఉన్నారు.

సోమందేపల్లి: ఎస్ఎంసీ కమిటీ సభ్యులు, ప్రధానోపాధ్యాయులకు గురువారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. యాజమాన్య కమిటీ వారికి విధులు, బాధ్యతల గురించి తెలియజేశారు. విద్యాహక్కు చట్టం, పోక్సోచట్టంపై అవగాహన కల్పించారు.

పరిగి:మండలంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులకు, పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్లకు కమిటీ పాత్ర, బాధ్యతలపై గురువారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా శిక్షణ పొందిన డీఆర్‌పీలు రమేష్, వెంకటేశ్ మాట్లాడుతూ ఎఎంసీ బాధ్యత, భోజన నిర్వహణ, పాఠశాల సమగ్రాభివృద్ధికి సంబంధించిన అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ లక్ష్మీదేవి, నర్సాపురం హెచ్ఎం వనజ, ఎస్ఎంసీ ఛైర్మన్లు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలి

సోమందేపల్లి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష పేర్కొన్నారు. గురువారం గుడ్‌మార్నింగ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని రంగేపల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలను కలిసి ప్రభుత్వం పనితీరుపై ఆరాతీశారు. ఆమె మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో ప్రజలకు సంక్షేమ పథకాలు సకాలంలో అందేవన్నారు. ప్రజలకు ఇచ్చిన మాటలను తాము నిలబెట్టుకున్నామన్నారు. కూటమి ప్రభుత్వం కొలువుతీరి ఆరు నెలలైనా ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందన్నారు. ఎన్నికల వేళ ప్రకటించిన సూపర్‌సిక్స్ లాంటి పథకాలు అమలుకు నోచుకోలేదన్నారు. స్థానికంగా గెలిచిన మంత్రి సవిత ప్రజలకు అందుబాటులో లేరన్నారు. ఇప్పటికైనా ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలని ఆమె కోరారు.

టెన్త్ విద్యార్థులకు మోడల్ పేపర్ల పంపిణీ

పెనుకొండ రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రొద్దం ప్రభుత్వ పాఠశాలలో యూటీఎఫ్‌ఆధ్వర్యంలో టెన్త్ విద్యార్థులకు మోడల్ పేపర్లు పంపిణీ చేసినట్లు ఎంఈఓ జయభాస్కర్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా పదోతరగతి పరీక్షలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు పెద్ద గువ్వలపల్లి గ్రామానికి చెందిన పవన్‌కుమార్ మోడల్ పేపర్లను అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ చిన్నప్పయ్య, హెచ్ఎం పద్మావతి, యూటీఎఫ్ నారాయణస్వామి, మారుతి, తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలను నివారిద్దాం



కరపత్రాలు విడుదల చేస్తున్న పంచాయతీ సిబ్బంది

సోమందేపల్లి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాల నిర్మూలనకు పాటుపడదామని సర్పంచ్ గంగాదేవి తెలిపారు. గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయంలోని సమావేశ భవనంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక గ్రామ సభలో ఆమె పాల్గొని మాట్లాడారు. బాల్య వివాహాలు అనాగరిక సంస్కృతి అన్నారు. అది చట్టరీత్యా నేరమన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతతో బాల్య వివాహాలను అరికట్టేందుకు కృషిచేయాలన్నారు. తల్లిదండ్రులకు అవగాహన కల్పించి బాల్య వివాహాలను నిర్మూలన చేసే దిశగా ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. అనంతరం అటవీశాఖ అధికారి మాట్లాడుతూ అటవీ సంపదను సంరక్షించుకోవాలన్నారు. అడవికి నిప్పు పెట్టడం మానుకోవాలన్నారు. అనంతరం కరపత్రాలు విడుదల చేశారు.